
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



ఖమ్మం

KHAMMAM

గురువారం, 26 సెప్టెంబరు 2024

మన దారి.. రహదారి



పూర్తయిన కోదాడ-ఖమ్మం జాతీయ రహదారి

ఒకప్పుడు సెంటీమీటరు జాతీయ రహదారిలేని ఉమ్మడి ఖమ్మం జిల్లాకు, ఇప్పుడు జాతీయ రహదారులే మణిహారం కాబోతున్నాయి. ఆంధ్రా-తెలంగాణానే కాకుండా దక్షిణ, ఉత్తరాది రాష్ట్రాలు ఈ జాతీయ రహదారులతో ఖమ్మం జిల్లాకు అనుసంధానం కాబోతున్నాయి. ఉమ్మడి రాష్ట్రంతోపాటు తెలంగాణ రాష్ట్రంలో నాడు ఆర్‌అండ్ బీ మంత్రిగా, ప్రస్తుతం వ్యవసాయశాఖ మంత్రిగా ఉన్న తుమ్మల నాగేశ్వరరావు పట్టుబట్టి ఈ జాతీయ రహదారుల మంజూరులో కీలకపాత్ర పోషించారు. ఉమ్మడి రాష్ట్రంలో విజయవాడ-జగదల్‌పూర్ జాతీయ రహదారి మంజూరు చేయించారు. ఖమ్మం-సూర్యాపేటకు నాలుగులైన్ల రహదారి కూడా తుమ్మల హయాంలోనే పూర్తయింది.

'హైవే' హారం

ఉమ్మడి ఖమ్మం జిల్లాకు అనుసంధానంగా పలు జాతీయ రహదారులు

- నిర్మాణం పూర్తయిన ఖమ్మం-కోదాడ హైవే
- చురుగ్గా సాగుతున్న ఖమ్మం-దేవరపల్లి పనులు
- మొదలైన నాగపూర్-అమరావతి నిర్మాణం
- ఖమ్మం-కురవికి టెండర్లు పూర్తి
- కొత్తగూడెం-ఇల్లెందు మీదుగా హైదరాబాద్‌కు మరో హైవే
- ఉమ్మడి ఖమ్మం జిల్లా రవాణా రంగానికి మహర్దశ
- కీలకపాత్ర వహించిన మంత్రి తుమ్మల

ఖమ్మం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కోదాడ-ఖమ్మం మార్గంలో 31.8 కి.మీ. పొడవున రూ.1,039 కోట్లతో 2022లో హైవే పనులు ప్రారంభించారు. 2024కు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అనుకున్నట్లే ఈ రహదారి నిర్మాణం పూర్తికావడంతో రాకపోకలు ప్రారంభించారు. ఈ హైవే ద్వారా విజయవాడ నుంచి కోదాడ మీదుగా ఖమ్మం రావడానికి రవాణా సౌలభ్యం మెరుగుపడింది. పైనంపల్లి వద్ద టోల్‌ప్లాజా ఏర్పాటు చేశారు. 356-ఏ కింద గుర్తించిన ఈ జాతీయరహదారి పైనంపల్లి, నేలకొండపల్లి, ముదిగొండ వద్ద ఎగ్జిట్‌లు ఉండగా వెంకటగిరి క్రాస్‌రోడ్డు వద్ద సూర్యాపేట జాతీయ రహదారికి కలుస్తుంది. అలాగే ఈ రహదారి ఖమ్మం-దేవరపల్లి రహదారికి కూడా అనుసంధానం కానుంది. ఇది గ్రానైట్ పరిశ్రమకు, వ్యవసాయ ఉత్పత్తులకు బందరు పోర్టుకు వెళ్లేందుకు ఉపయోగపడనుంది. ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు ఈ రహదారి మెరుగైన రవాణ సౌలభ్యం కలిగిస్తుంది.

చురుగ్గా ఖమ్మం-దేవరపల్లి హైవే

ఖమ్మం-దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్‌హైవే పనులు చురుగ్గా సాగుతున్నాయి. మూడుప్యాకేజీల కింద మొదలైన ఈ పనులు జిల్లాలో 162.12 కి.మీ. వరకు నిర్మాణం అవుతోంది. పూర్తిగా రైతుల వ్యవసాయ పొలాల్లో భూసేకరణ జరిపించి పనులు చకచకా జరిగేలా చర్యలు తీసుకుంటున్నారు. రహదారి మంజూరులోనూ భూసేకరణలోనూ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఆంధ్రా-తెలంగాణ రాష్ట్రాలను అనుసంధానం చేస్తూ ఈ నాలుగు లైన్ల రహదారి నిర్మిస్తున్నారు. 365-బీ ఎక్స్‌ప్రెస్ హైవేగా ఈ రహదారి నిర్మాణంలో ఉంది. వాస్తవానికి సూర్యాపేట-దేవరపల్లి మార్గంలో 221 కి.మీ పొడవున భారత్‌మాల యోజన కింద (బీఎంపీ) ప్రాజెక్టు కింద ఈ రహదారి మంజూరైంది. అయితే సూర్యాపేట నుంచి ఖమ్మం వరకు గతంలోనే నాలుగులైన్ల రహదారి నిర్మించగా ఖమ్మం నుంచి దేవరపల్లి వరకు గ్రీన్‌ఫీల్డ్‌హైవే పనులు జరుగుతున్నాయి. సుమారు 2వేల ఎకరాలు భూసేకరణ చేసి రైతులకు పరిహారం చెల్లించారు. ఇది ఖమ్మం, చింతకాని, వైరా, కల్లూరు, తిరువూరు, సత్తుపల్లి జంగారెడ్డిగూడెం, దేవరపల్లి వరకు నిర్మాణం జరుగుతుంది. రూ.2300 కోట్లతో ఖమ్మం జిల్లాలో పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఉగాది నాటికి ఈ రహదారి పనులు పూర్తిచేస్తామని నేషనల్ హైవే అధికారులు తెలిపారు. ఇది కాకినాడ, విశాఖ పోర్టులకు అనుసంధానం కానుంది. హైదరాబాద్-విశాఖ మధ్య రోడ్డు రవాణా మరింత తక్కువ సమయంలో సాగనుంది.

మొదలైన ఖమ్మం-అమరావతి హైవే పనులు

ఆంధ్రా-తెలంగాణ-మహారాష్ట్రను అనుసంధానం చేస్తూ రోడ్డు రవాణా వ్యవస్థను మరింత వేగవంతం చేసేందుకు నిర్మిస్తున్న నాగపూర్-అమరావతి గ్రీన్‌ఫీల్డ్‌హైవేలో ఖమ్మం నుంచి అమరావతి ప్యాకేజీ పనులు మొదలయ్యాయి. జిల్లాలోని చింతకాని మండలం కొదుమూరు, వందనం, నాగిలిగొండ తదితర గ్రామాల మీదుగా అమరావతి గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులు చురుగ్గా సాగుతున్నాయి. మొత్తం రూ.14,670 కోట్లతో నాగపూర్-అమరావతి(163జి) నాలుగు లైన్ల రహదారి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం భారత్‌మాల ప్రాజెక్టు కింద చేపట్టింది. అయితే ఇప్పటికే సర్వేలు, భూసేకరణలు కొన్నిచోట్ల పూర్తికాగా మరికొన్నిచోట్ల పెండింగ్‌లో ఉన్నాయి.

ఖమ్మంలోని వీ.వెంకటాయపాలెం నుంచి విజయవాడ వైపు వెళ్లే ప్యాకేజీకి సంబంధించి పనులను నేషనల్ హైవే అథారిటీ ప్రారంభించింది. ఖమ్మం నుంచి జిల్లా సరిహద్దు వరకు 77కి.మీలు (మిగతా 6వ పేజీలో)



కొనసాగుతున్న ఖమ్మం-దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్‌హైవే ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు

ఖమ్మం జిల్లాలో జాతీయ రహదారుల స్వరూపం

కోదాడ-ఖమ్మం హైవే (నెంబర్ 356ఏ)
పొడవు 31.8 కి.మీ.- నిధులు రూ.1039 కోట్లు
2022లో మొదలైన పనుల పూర్తి. రాకపోకలు ప్రారంభం.

ఖమ్మం-దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ హైవే (నెంబర్ 365బి)
పొడవు 162.12 కి.మీ. - నిధులు రూ.2300 కోట్లు
వచ్చే ఉగాది నాటికి పూర్తి చేయాలని లక్ష్యం

అమరావతి-నాగపూర్ గ్రీన్‌ఫీల్డ్ హైవే
మొత్తం 420 కి.మీ. - నిధులు రూ.14,670 కోట్లు
ఖమ్మం జిల్లాలో 77 కి.మీ. - నిధులు 2800 కోట్లు
2026 నాటికి పూర్తి చేయాలని లక్ష్యం

ఖమ్మం-కురవి హైవే
37 కి.మీ. - నిధులు రూ.430 కోట్లు
2026 నాటికి పూర్తి చేయాలని లక్ష్యం

మోడల్‌గా తీర్చిదిద్దుతా..

- సుందర ఖమ్మం నగరమే నా లక్ష్యం
- భవిష్యత్తు తరాలకు ప్రయోజనం చేకూర్చే పనులు చేపట్టాలి
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- 16వ డివిజన్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



ఖమ్మంలో అభివృద్ధి పనులకు మంత్రి తుమ్మల శంకుస్థాపన..

ఖమ్మం సంక్షేమ విభాగం, సెప్టెంబరు 25: ఇప్పుడు చేపట్టే అభివృద్ధి పనులు రాబోయే పది తరాలకు ప్రయోజనం చేకూర్చేలా ఉండాలని, భవిష్యత్‌ను దృష్టిలో పెటుకొని అభివృద్ధి కార్యక్రమాల కార్యాచరణ జరుగుతుందని, రాష్ట్రంలోనే ఆదర్శవంతమైన మోడల్ నగరంగా ఖమ్మాన్ని తీర్చిదిద్దుతానని, నగరం చుట్టూ రహదారులు, నగరం లోపల తీగల వంతెనలతో సుందర ఖమ్మంగా నిర్మాణం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. బుధవారం ఖమ్మం నగరంలోని 16వ డివిజన్‌లో అభివృద్ధి పనులు, డ్రైనేజీల నిర్మాణానికి మంత్రి తుమ్మల శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మాట్లాడారు. ఖమ్మం నియోజకవర్గంలోనే తిరుగులేని రికార్డుస్థాయి మెజార్టీతో ప్రజలు తనని గెలిపించారని, అందుకే ప్రజాభీష్టం మేరకు తన పనితీరు ఉంటుందన్నారు. ఖమ్మం కీర్తి ప్రతిష్టలు పెంచేలా భవిష్యత్ ప్రజలను దృష్టిలో ఉంచుకొని అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతున్నామని మంత్రి తుమ్మల పేర్కొన్నారు.

మున్నేరు పరివాహక ప్రాంతంలో ముంపునకు గురవుతున్న ప్రజలకు మైదాన ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణం, ఖమ్మం ఖిల్లాపై రోప్‌వే ఏర్పాటు, వెలుగుమట్ల అర్బన్ పార్కును అభివృద్ధి చేసి ఖమ్మం నగరాన్ని టూరిజం హబ్‌గా ఏర్పాటు చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. మేయర్ పునుకొల్లు నీరజ, కార్పొరేటర్లు మేడారపు వెంకటేశ్వర్లు, ఆళ్ల నిరీషారెడ్డి, నాయకులు సాధు రమేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

28న జాబ్ మేళా

- వివిధ కంపెనీలలో 850 ఖాళీల భర్తీ
- జిల్లా ఉపాధి అధికారి మాధవి

ఖమ్మం కలెక్టరేట్, సెప్టెంబరు 25: ఖమ్మం, కొత్తగూడెం, నేలకొండపల్లి, హైదరాబాద్‌లలో ఉన్న వివిధ కంపెనీలలో 850 ఖాళీ ఉద్యోగాల భర్తీకి ఈ నెల 28న ఎస్సార్‌బీజీఎన్నార్ డిగ్రీ కళాశాలలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎస్.మాధవి తెలిపారు. అపోలో ఫార్మసీ, అపోలో హెల్త్ కేర్, మెడ్ ప్లస్ ఫార్మసీ, హెటిరో ల్యాబ్స్ లిమిటెడ్, మధుకాన్ షుగర్ అండ్ పవర్ లిమిటెడ్, సత్య మైక్రో క్యాపిటల్ లిమిటెడ్, ముత్తూట్ మనీ ప్రైవేట్ లిమిటెడ్, భారత్ పే, శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్, టోపికో ఇన్సూరెన్స్ బ్రోకింగ్ (భారత్ హ్యుందాయ్), ఫ్యూచర్ ఐటీ సొల్యూషన్స్, స్కినీడర్ ఎలక్ట్రిక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, రిలయన్స్ నిప్పో లైఫ్ ఇన్సూరెన్స్ ఫర్ ఉమెన్స్, ఫ్లిప్‌కార్ట్, వికేర్, టీం లీజ్ సర్వీసెస్ లిమిటెడ్ కంపెనీలలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలు భర్తీ చేయనున్నట్టు తెలిపారు. జిల్లాలోని 18 నుంచి 40 ఏళ్ల వయస్సు గల నిరుద్యోగ యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, సర్టిఫికెట్స్ జిరాక్స్ కాపీలతో హాజరై పేర్లు నమోదు చేసుకోవాలని, మరిన్ని వివరాల కోసం 90638 58341లో సంప్రదించాలని కోరారు.

ఎంసీహెచ్‌కు సమస్యల జబ్బు

- అరకొరగా వైద్య సిబ్బంది
- భవనం గోడల పైనుంచి లీకవుతున్న మురుగు నీరు
- అస్తవ్యస్తంగా పారిశుధ్య నిర్వహణ

7



ధ్రువీకరణ పత్రాల జారీకి చర్యలు

- సంబంధిత శాఖల ద్వారా ప్రణాళికయుతంగా అందజేస్తాం
- 237 పాఠశాలల్లో బాలికలకు సెల్ఫ్ డిఫెన్స్ శిక్షణ తరగతులు
- అదనపు కలెక్టర్ శ్రీజ



ఖమ్మం కలెక్టరేట్, సెప్టెంబరు 25: వరద బాధితుల పిల్లలకు పైసా ఖర్చు లేకుండా అవసరమైన విద్యాధ్రువీకరణ పత్రాల జారీకి కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నట్టు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి.శ్రీజ స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఇంటింటి సర్వే చేపట్టి వాస్తవంగా నష్టపోయిన విద్యార్థులు, రైతుల పట్టాదారు పాస్ పుస్తకాలు, ఆధార్ కార్డులు, విద్యార్థుల ధ్రువీకరణ పత్రాల నష్టంపై అంచనాలు వేసినట్లు తెలిపారు. సర్వే ఆధారంగా ఇప్పటివరకు పదో తరగతి సర్టిఫికెట్ల కోసం 680, ఇంటర్ 454, డిగ్రీ, బీటెక్‌కు సంబంధించి 94, పీజీ 47, పాస్‌పోర్ట్ కొరకు 29 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. రెవెన్యూ పరంగా ఆదాయ సర్టిఫికెట్లు 269, కుల ధ్రువీకరణ పత్రాలు 376, నివాస ధ్రువీకరణ పత్రాలు 189, ఓబీసీ సర్టిఫికెట్లు 77, పాస్ పుస్తకాలు 88, ఆధార్ కార్డు 388, రేషన్‌కార్డు 182 మంది కోల్పోయినట్టు దరఖాస్తులు అందినట్టు తెలిపారు.

విద్యా సర్టిఫికెట్లకు సంబంధించి విద్యార్థి పేరు, చిరునామా, పాసైన సంవత్సర వివరాలు విద్యాశాఖకు జిల్లా యంత్రాంగం ద్వారా ప్రతిపాదనలు పంపి సర్టిఫికెట్ల జారీ చేయిస్తామన్నారు. పాస్‌పోర్ట్ అధికారులతో కూడా మాట్లాడి వాటిని జారీ చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. రెవెన్యూ సంబంధిత సర్టిఫికెట్ల జారీ కోసం ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఇప్పటికే ఖమ్మం రూరల్ మండలంలో నిర్వహించినట్లు, ఖమ్మం అర్బన్‌లోనూ త్వరలో నిర్వహిస్తామని తెలిపారు.

237 పాఠశాలల్లో ఆత్మ సంరక్షణ శిక్షణ

జిల్లాలోని 237 ప్రభుత్వ పాఠశాలల్లో బాలికలకు ఆత్మసంరక్షణలో ప్రత్యేక శిక్షణ అందించేందుకు వారానికి 3రోజులపాటు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్టు అదనపు కలెక్టర్ శ్రీజ తెలిపారు. దీనికోసం 120 మంది శిక్షకులను తాత్కాలికంగా ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ప్రతి బుధవారం జిల్లా అధికారులు ప్రభుత్వ పాఠశాలల్లో పర్యటించి మధ్యాహ్న భోజన నాణ్యతను తనిఖీ చేసి, విద్యార్థులకు మెరుగైన భోజనం అందించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు అందిస్తున్నామని అన్నారు. ప్రతి నెలా ప్రభుత్వ పాఠశాలల్లో పేరెంట్ టీచర్స్ మీటింగులు పకడ్బందీగా జరుగుతున్నాయని, ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం నాణ్యత, విద్యార్థుల హాజరు, పేరెంట్ టీచర్స్ మీటింగ్ నిర్వహణను కలెక్టర్ ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తున్నారని అన్నారు. జిల్లాలోని 50పాఠశాలల్లో ముందస్తుగా ఇంగ్లీష్ ల్యాబ్‌లను ఏర్పాటు చేశామని, భవిష్యత్తులో దశలవారీగా జిల్లా వ్యాప్తంగా ఈ ల్యాబ్‌లను విస్తరించేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ సమావేశంలో ఖమ్మం జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖరశర్మ తదితరులు పాల్గొన్నారు

ధాన్యం దందా
గుట్టు రట్టు



రైస్‌మిల్లులో స్టాక్‌ను తనిఖీ చేస్తున్న టాస్క్‌ఫోర్స్, సివిల్ సప్లయీస్ అధికారులు

- ఎస్‌ఏఆర్ రైస్ మిల్లులో సివిల్ సప్లయీస్ టాస్క్‌ఫోర్స్ తనిఖీలు
- రెండు రోజుల పాటు కొనసాగిన విచారణ
- 25వేల మెట్రిక్ టన్నుల ధాన్యం వ్యత్యాసం గుర్తింపు
- నిర్వాహకులపై క్రిమినల్ కేసు నమోదు

కొణిజర్ల, సెప్టెంబరు 25: ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం లాలాపురం సమీపంలోని ఎస్‌ఏఆర్ రైస్ ప్రొడక్ట్స్ మిల్లులో సివిల్ సప్లయీస్, టాస్క్‌ఫోర్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో అధికారులు సీఎంఆర్‌లో 25వేల మెట్రిక్ టన్నుల ధాన్యం వ్యత్యాసం ఉన్నట్లు గుర్తించారు. రెండు రోజుల పాటు జరిగిన తనిఖీలపై బుధవారం డీఎస్‌వో చందన్‌కుమార్, సివిల్ సప్లయీస్ డీఎం గంటా శ్రీలత విలేకరులకు వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2022-23 రబీ సీజన్, 2023-24 ఖరీఫ్ సీజన్ మొత్తానికి గాను 3,50,622.65 క్వింటాళ్ల ధాన్యాన్ని ఈ మిల్లుకు అప్పగించగా 99,122.68 క్వింటాళ్ల ధాన్యాన్ని మాత్రమే మర ఆడించారన్నారు. మిగిలిన 2,51,499.97 క్వింటాళ్లు (25వేల మెట్రిక్ టన్నులు) తేడా ఉన్నట్లు గుర్తించామన్నారు. రెండు సీజన్లకు సరఫరా చేయాల్సిన ధాన్యం కంటే తక్కువ ధాన్యాన్ని సరఫరా చేసి మిగిలిన ధాన్యం బయటకు తరలిస్తున్నట్లు అధికారులు గుర్తించారు.

వ్యత్యాసం రావడంపై ఎస్‌ఏఆర్ మిల్లు యాజమానిపై క్రిమినల్ కేసు నమోదు చేసిన్నట్లు వారు తెలిపారు. ఈ తనిఖీల్లో టాస్క్‌ఫోర్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు కమల్‌పాషా, ఆర్ పుల్లయ్య, స్వామిదాస్, డీటీలు విజయ్‌బాబు, రామచంద్రరావు, మదన్, కొణిజర్ల తహసీల్దార్ తఫ్జల్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులు చూపిన వ్యత్యాసాన్ని ప్రభుత్వానికి చెల్లిస్తాం

బాలకృష్ణ, మిల్లు నిర్వాహకుడు

ఎస్‌ఏఆర్ మిల్లు సామర్థ్యం 50వేల క్వింటాళ్లు.. కానీ ప్రభుత్వం దానికి మూడు రెట్లు ధాన్యాన్ని పంపించడంతో సమస్యలు వచ్చాయి. నిబంధనల ప్రకారం నడుచుకుంటూ మిల్లును నడిపిస్తున్నాం. మర ఆడించిన బియ్యాన్ని గోదాములకు తరలిస్తున్నాం. వారాల తరబడి గోదాముల వద్ద నిలిపి ఉంచటంతో ఎంఐటీ టెస్టుల్లో ఫెయిల్ అయి తిప్పి పంపిస్తున్నారు. తేమశాతం ఎక్కువ ధాన్యాన్ని అందిస్తున్నారు. తడిసిన ధాన్యాన్ని సైతం దింపుకోవలసిన పరిస్థితి వచ్చింది. ఏది ఏమైనా అధికారులు తేల్చిన వ్యత్యాసం మొత్తాన్ని ప్రభుత్వానికి చెల్లిస్తాం.

వ్యథసాయం...



'ఎత్తిపోతల'కు చోరీల షాక్

- ట్రాన్స్‌ఫార్మర్ల కాపర్ వైరు చోరీతో నిరుపయోగం
- నాలుగు నెలలుగా పనిచేయని పథకాలు
- పునరుద్ధరణ ఏర్పాట్లలో అధికారుల నిర్లక్ష్యం
- 3 వేల ఎకరాల సాగు ప్రశ్నార్థకం
- అద్దె పరికరాలు ఏర్పాటు చేసుకుంటున్న రైతులు
- ఇంజనీరింగ్ అధికారుల మధ్య సమన్వయ లోపం

కల్లూరు డివిజన్‌లో సాగర్ కాల్వలపై ఎత్తిపోతల పథకాలకు చోరీల గ్రహణం పట్టింది. లిఫ్టుల్లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను బద్దలు కొట్టి రాగి తీగను దొంగలు తస్కరించడంతో ఎత్తిపోతలు పనిచేయకుండా పోతున్నాయి. ఏడు నెలలుగా ఈ తంతు సాగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. పక్కనే సాగర్‌కాల్వలు ఉన్నా ఎత్తిపోసే లిఫ్టులు నిరుపయోగంగా ఉండటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల సమన్వయ లోపంతో నూతన ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు కావడం లేదంటూ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు కూడా రైతులు ఫిర్యాదు చేశారు. కాగా ప్రభుత్వానికి ఆర్థిక ప్రతిపాదనలు పెట్టామని, అనుమతి రాగానే లిఫ్టులకు మరమ్మతులు చేయిస్తామని అధికారులు చెబుతున్నారు.

\- కల్లూరు

7

జోరు వాన.. పంటలకు ఊపిరి

ఖమ్మం టౌన్, సెప్టెంబరు 25: ఖమ్మం జిల్లాలో మంగళవారం ఉదయం నుంచి బుధవారం ఉదయం వరకు భారీవర్షం కురిసింది. జిల్లాలో అత్యధికంగా నేలకొండపల్లి మండలంలో 13.6 సెం.మీ. వర్షపాతం నమోదైంది. కూసుమంచి మండలంలో 10.3 సెం.మీ, పెనుబల్లి మండలంలో 5.6 సెం.మీ, సత్తుపల్లి మండలంలో 5.1 సెం.మీ వర్షపాతం నమోదైంది. చింతకాని, ఖమ్మంఅర్బన్, ఖమ్మంరూరల్, వేంసూరు, ముదిగొండ, కొణిజర్ల, ఏన్కూరు భారీ వర్షం కురిసింది. మిగిలిన మండలాల్లో 1 సెం.మీ. వర్షం కురిసింది. నీరులేక ఎండిపోతున్న పంటలకు ఈ వర్షం ఊపిరి పోసింది.



ద్విచక్రవాహనాల రాకపోకలు పరిశీలిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

ద్విచక్ర వాహనాలకు ఓకే..

ప్రకాష్‌నగర్ బ్రిడ్జిపై రాకపోకలకు అనుమతులు

ఖమ్మంక్రైం, సెప్టెంబరు 25: నగరంలోని ప్రకాష్‌నగర్ బ్రిడ్జిపై ద్విచక్ర వాహనాల రాకపోకలు కొనసాగించేలా పోలీసులు అనుమతి ఇచ్చారు. ఇటీవల మున్నేరు వరద పోటుతో వంతెన స్లాబులు కదలడంతో ముందు జాగ్రత్తగా రాకపోకలను నిషేధించారు. బ్రిడ్జికి ఇరువైపులా గోడలు నిర్మించారు. అయితే ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్న నేపథ్యంలో అధికారులు రాకపోకలను కొనసాగిస్తూ కొద్ది మేర గోడ తొలగించారు. దీంతో బుధవారం సాయంత్రం నుంచి ద్విచక్ర వాహనదారుల రాకపోకలు మొదలయ్యాయి. పోలీసుల నిర్ణయంపై హర్షం వ్యక్తమవుతోంది.

భూ సేకరణ బాధితులకు మెరుగైన నష్టపరిహారం

» ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మం కలెక్టరేట్, సెప్టెంబరు 25: జాతీయ రహదారులు, ప్రభుత్వ ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు భూసేకరణలో నిర్వాసితులు మెరుగైన నష్టపరిహారాన్ని అందిస్తోందని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. ప్రజలు అభివృద్ధి పనులకు సహకరించాలని ఆయన కోరారు. బుధవారం కలెక్టరేట్ లోని కలెక్టర్ చాంబర్ లో నేషనల్ హైవే ప్రాజెక్ట్ భూ సేకరణ నిర్వాసితులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. చింతకాని మండలం కోదుమూరు, బస్వాపురం, కొనిజర్ల మండలం మునగాల, గోపతి, వైరా మండలం సిరిపురం, సోమవరం, పెనుబల్లి మండలం చింతగూడెం గ్రామాల్లో భూసేకరణలో నిర్వాసిత రైతులతో కలెక్టర్ నష్టపరిహారం పై చర్చించారు. భూ సేకరణకు అవార్డ్ పాస్ చేసినట్లు, ప్రభుత్వ పరిధిలో ఉన్న మెరుగైన పరిహారం అందజేసేందుకు చర్యలు చేపట్టనున్నట్లు కలెక్టర్ తెలిపారు. హైవేరోడ్లతో మిగులు భూములకు డిమాండ్ పెరుగుతుందని కలెక్టర్ అన్నారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్ పాల్గొన్నారు



మాట్లాడుతున్న కలెక్టర్

జిల్లాకు ఐదుగురు ఎస్ఐల కేటాయింపు

» సీపీని కలిసిన శిక్షణ పూర్తి చేసుకున్న సబ్ ఇన్‌స్పెక్టర్లు

ఖమ్మంక్రైం, సెప్టెంబరు 25: తెలంగాణ రాష్ట్రపోలీసు అకాడమిలో 9నెలలపాటు విజయవంతంగా శిక్షణ పూర్తిచేసుకుని 547 మంది సబ్‌ఇన్‌స్పెక్టర్ అభ్యర్థులను రాష్ట్ర పోలీసుశాఖ జిల్లాలకు కేటాయించింది. ఈనేపథ్యంలో ఖమ్మం కమిషనరేట్‌కు కేటాయించిన ఐదుగురు సబ్ ఇన్‌స్పెక్టర్లు బుధవారం ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్‌దత్‌ను కలిశారు.

ఈసందర్భంగా సీపీ వారికి శుభాకాంక్షలు తెలిపి తల్లిదండ్రుల ఆకాంక్షలు నెరవేర్చేలా అప్పగించిన శాఖాపరమైన బాధ్యతలు సక్రమంగా నిర్వహించాలని అన్నారు. ఈసందర్భంగా సబ్‌ఇన్‌స్పెక్టర్లను నగర పరిధిలోని పోలీసుస్టేషన్లకు కేటాయించారు.



సీపీని కలిసిన సబ్ ఇన్‌స్పెక్టర్లు

నేడు, రేపు పెసల కొనుగోలు కేంద్రాలకు విరామం

ఖమ్మం మార్కెట్, సెప్టెంబరు 25: 26, 27 తేదీలలో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో ఏర్పాటు చేసిన మార్క్‌ఫెడ్ పెసల కొనుగోలు కేంద్రానికి రెండు విరామ ప్రకటించినట్లు అధికారులు తెలిపారు. ఈ మేరకు అడ్తీ వ్యాపారులు వారికి సంబంధించిన రైతులకు గురు, శుక్ర వారాలు పెసలను తీసుకురావద్దని సెల్ పోన్ మెసేజ్‌లు పంపారు.

న్యాయం జరగాలంటే దర్యాప్తు కీలకం: సీపీ

ఖమ్మంక్రైం, సెప్టెంబరు25:న్యాయం జరగాలంటే సరైన ఆధారాలు నేర దర్యాప్తు కీలకమని పోలీసు కమిషనర్ సునీల్‌దత్ అన్నారు. నగరంలోని పోలీసు శిక్షణ కేంద్రంలో బుధవారం జిల్లాస్థాయి పోలీసుడ్యూటీ మీట్ కార్యక్రమాన్ని సీపీ ప్రారంభించారు.

ఈసందర్భంగా సీపీ మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానం కేసుల దర్యాప్తులో మెళుకువలు నేర్చుకునేందుకు పోలీసుడ్యూటీ మీట్ దోహదపడుతుందని తెలిపారు. జాతీయస్థాయిలో జరిగే ఈమీట్‌కు వివిధప్రాంతలాల నుంచి పోలీసు అధికారుల మధ్య మరింత సహకారం, ప్రోత్సాహం లభిస్తుందని, జాతీయ స్థాయలో జరిగే డ్యూటీ మీట్‌కు విజేతలకు మంచి గుర్తింపు ఉంటుందన్నారు. ఈడ్యూటీ మీట్‌లో పాల్గొనేవారందరు అత్యుత్తమ ప్రదర్శన అందించాలని రాష్ట్రం తరుపున ప్రాతినిధ్యం వహించాలన్నారు. ఈకార్యక్రమంలో ఏడీసీపీ నరేష్‌కుమార్, ఏసీపీ రవి, సాంబరాజు, నరసయ్య పాల్గొన్నారు.



మహేష్‌కుమార్‌తో డా. రవి తదితరులు

టీపీసీసీ అధ్యక్షుడిని కలిసిన కాంగ్రెస్ నేతలు

ఇల్లెందు, సెప్టెంబరు 25: నూతనంగా నియామితులైన తెలంగాణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బి.మహేష్‌కుమార్ గౌడ్‌ను జిల్లా కాంగ్రెస్ ఎస్టీ సెల్ చైర్మన్ డా. జిన రవి ఆధ్వర్యంలో బుధవారం గాంధీభవన్‌లో కాంగ్రెస్ నాయకుల బృందం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా పీసీసీ సభ్యులు నల్లపు దుర్గాప్రసాద్, కాంగ్రెస్ జిల్లా నాయకులు పసిక తిరుమల్, సందీప్‌రెడ్డి, బానోత్ వెంకటేష్ తదితరులు టీపీసీసీ అధ్యక్షుడిని కలిసిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ఎస్టీ చైర్మన్ డా. జి.రవి జిల్లాలో గిరిజనుల అభ్యున్నతికి వారి సంక్షేమానికి నూతనంగా పథకాలను అమలు చేయాలని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌ను కోరారు. ఈసందర్భంగా మహేష్‌కుమార్‌గౌడ్ ఎస్టీ సెల్ తదితర అనుబంధ సంఘాలను మరింత పటిష్టం చేసేందుకు కృషి చేయాలని కోరినట్లు డా. రవి తెలిపారు.

కొండా లక్ష్మణ్ బాపూజీ కాంస్య విగ్రహ ప్రతిష్ఠ

మణుగూరు, సెప్టెంబరు 25: తెలంగాణా ఉద్యమ నేత, మాజీ మంత్రి కొండా లక్ష్మణ్ బాపూజీ కాంస్య విగ్రహాన్ని మణుగూరు పట్టణంలోని జడ్పీ కో ఎడ్యుకేషన్ సమీపంలో ప్రతిష్ఠించారు. బుధవారం పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరై కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. గజమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ కార్యక్రమానికి నిర్వాహకులుగా మణుగూరు మండల పద్మశాలి సంక్షేమ సంఘం కమిటీ సభ్యులు బాధ్యత వహించగా తహసీల్దార్ రాఘవరెడ్డి, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంఈవో వీరాస్వామి, ఎంపీవో వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ బచ్చల భారతి పాల్గొన్నారు.

వ్యవసాయ రంగంలో అభివృద్ధి సాధించాలి

» జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబూరావు

గుండాల, సెప్టెంబరు 25: రైతులు నిత్యం సాగు చేసే పంటలతో పాటు అధిక లాభాలను అందించే పంటలను ఎంచుకొని వ్యవసాయ రంగంలో అభివృద్ధి చెందాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబూరావు, సీపీవో సంజీవ్ రావులు అన్నారు. ఆస్పిరేషనల్ బ్లాక్(సంపూర్ణతా అభియాన్) కార్యక్రమంలో భాగంగా బుధవారం రైతువేదిక వద్ద సాయిల్ హెల్త్ కార్డులు పంపిణీ చేశారు. 1195 మంది రైతులకు సాయిల్ హెల్త్ కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఇల్లెందు, మణుగూరు ఏడీఏలు లాల్‌సింగ్, తాతారావు, కేవీకే కోఆర్డినేటర్ లక్ష్మీనారాయణ, ఏవో వెంకటరమణ, ఆస్పిరేషన్ బ్లాక్ కోఆర్డినేటర్ నవనీత్, తహసీల్దార్ ఇమ్మానుయేల్, ఎంపీడీవో సత్యనారాయణ, ఏఈవోలు బాలరాజు, లెనిన్ పాల్గొన్నారు.


తెలంగాణ ఉద్యోగుల జేఏసీ వైస్‌చైర్మన్‌గా సైదులు



ఖమ్మం ఖానాపురంహవేలీ, సెప్టెంబరు 25: తెలంగాణ ఉద్యోగుల జేఏసీ వైస్ చైర్మన్‌గా ఎస్‌టీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవరకొండ సైదులును ఏకగ్రీకంగా ఎన్నుకున్నారు. మంగళవారం హైదరాబాద్‌లో సుందరయ్య విజ్ఞానకేంద్రంలో 205 భాగస్వామ్య సంఘాలతో ఏర్పాటు చేసిన సమావేశంలో జేఏసీ వైస్ చైర్మెన్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు సైదులును అభినందించారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల, పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

గాడితప్పుతున్న విద్యాశాఖ పాలన

- » అమెరికాలో ఉన్న హెచ్‌ఎంకు ఎంఈవోగా బాధ్యతలు
- » డుమ్మా టీచర్లపై కానరాని చర్యలు
- » అప్ అండ్ డౌన్‌తో వేళకు రాని కార్యాలయ సిబ్బంది
- » ఏ సమాచారం అడిగినా రోజులు గడవాల్సిందే...



ఖమ్మం ఖానాపురం హవేలి, సెప్టెంబరు 25: ఖమ్మం జిల్లా పాఠశాల విద్యాశాఖ పాలన గాడి తప్పుతోంది. నియామకాలు, డిప్యూటేషన్లలో అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. కొన్ని వివాదాస్పంద విషయాల్లో నిర్లిప్తత, పక్షపాతం చూపిస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి. మంగళవారం జరిగిన ఎంఈవోల నియామకం విద్యాశాఖ పాలనకు అద్దం పడుతోంది. మూడు నెలల సెలవు పెట్టి అమెరికా వెళ్ళిన ఓ హెచ్‌ఎంకు ఖమ్మం అర్బన్ ఇంచార్జి ఎంఈవోగా బాధ్యతలు అప్పగించారు. నగరంలోని బాలికల పాఠశాల హెచ్‌ఎం సెప్టెంబరు 4 నుంచి డిసెంబరు 2 వరకు సెలవు పెట్టి అమెరికా వెళ్లారు. విధుల్లో లేని ఆమెకు ఎలా బాధ్యతలివ్వడం చర్చనీయాంశంగా మారింది. ఎన్‌వోసి ఇచ్చిన విద్యాశాఖ అధికారులే హెచ్‌ఎంకు ఎంఈవోగా ఎలా బాధ్యతలు అప్పగిస్తారంటూ పలువురు ఉపాధ్యాయులు చర్చించుకుంటున్నారు. అమెరికా నుంచి విధులు నిర్వర్తిసారా..? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

పలువురు టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది కూడా సెలవు పెట్టి విదేశాలకు వెళ్లేందుకు అనుమతి ఇచ్చారు. వీరి విషయంలో కూడా నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు ఆరోపణలున్నాయి. ఇదే అదనుగా కొందరు ఉపాధ్యాయులు డీఈవో అనుమతి లేకుండా, ఎంఈవోలకు సమాచారం ఇచ్చి అటు సెలవు పెట్టకుండా, ఇటు పాఠశాలకు వెళ్లకుండా సొంత వ్యాపారాలు చేసుకుంటున్నట్లు ఆరోపణలున్నాయి. ఈ విషయాలు విద్యాశాఖ అధికారులకు తెలిసినా చర్యలు తీసుకోవడంలో మీనమేషాలు లెక్కిస్తున్నట్లు ఆరోపణలున్నాయి.

ఇదిలాఉండగా, ఏజెన్సీ ప్రాంతాల్లో కొందరు ఉపాధ్యాయులు ఉదయం 9 గంటలకే పాఠశాలలకు రావాల్సి ఉండగా ఉదయం 11 గంటల వరకు కూడా రావడం లేదనే విమర్శలున్నాయి. కొందరు ఉపాధ్యాయులు తమకు బదులు విద్యా వాలంటీర్లను ఏర్పాటు చేసుకొని నెలల కొద్దీ పాఠశాలలకు డుమ్మా కొడుతున్నా వారిపై విద్యాశాఖ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలున్నాయి.

విద్యాశాఖలో ఇటీవల చోటుచేసుకున్న డిప్యూటేషన్ల వ్యవహారంలో నిబంధనల ఉల్లంఘనపై డీఈఓకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని పలువురు ఉపాధ్యా సంఘాల నాయకులు చెబుతున్నారు. ఒంటెత్తుపోకడలతో విద్యార్థుల, ఉపాధ్యాయుల సమస్యలకు పరిష్కారం చూపటంలేదనే విమర్శలు వినపడుతున్నాయి. కాగా, పాఠశాలల నిధులు స్వాహా చేసిన ఉద్యోగి నుంచి కొంతమేర రికవరీ చేసినా, బాధ్యులైన వ్యక్తులపై ఎలాంటిచర్యలు తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. దీని వెనుక పలు అదృశ్యశక్తులు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. మరోవైపు రెండు నెలల క్రితం డీఈవో కార్యాలయానికి బదిలీపై వచ్చిన కొందరు ఉద్యోగులు వివిధ ప్రాంతాల నుంచి అప్ అండ్ డౌన్ చేస్తూ సమయపాలన పాటించడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఇష్టారాజ్యంగా సెలవులు పెడుతుండటంతో ఫైళ్లు పేరుకు పోతున్నట్లు చెబుతున్నారు. విద్యాశాఖకు సంబంధించి ఏ సమాచారం అడిగినా ఉన్నతాధికారులు రోజుల తరబడి జాప్యం చేస్తున్నారని, రకరకాల సాకులు చెబుతున్నారని విమర్శలు వస్తున్నాయి. జిల్లాలో విద్యాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిన కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్.. విద్యాశాఖను గాడిలో పెట్టాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

పోక్సో కేసు నమోదు

సత్తుపల్లిరూరల్, సెప్టెంబరు 25: సత్తుపల్లి పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీకి చెందిన షేక్ పాషామియా అనే వ్యక్తిపై బుధవారం రాత్రి పోక్సో కేసు నమోదైంది. సత్తుపల్లి పట్టణ సీఐ టి. కిరణ్ తెలిపిన వివరాల ప్రకారం సదరు వ్యక్తి ఓ బాలికపై అసభ్యకరంగా ప్రవర్తించడంతో బాధిత కుటుంబం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశామన్నారు. కోర్టులో హాజరు పరచగా రిమాండ్‌కు తరలించామన్నారు.

మౌలిక వసతుల కల్పన పర్యవేక్షణ బాధ్యత పీవోలదే..

భద్రాచలం, సెప్టెంబరు 25: ఆదివాసి గిరిజన గ్రామాల గిరిజనులకు కొండరెడ్ల కుటుంబాలకు కల్పిస్తున్న మౌలిక వసతుల కల్పన పర్యవేక్షణ ప్రత్యేక బాధ్యత ఐటీడీఏ ప్రాజెక్టు అధికారులదేనని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శి ఏ శరత్ అన్నారు. గిరిజనులకు వారి పిల్లలకు అన్ని సక్రమంగా అందుతున్నది లేనిది పర్యవేక్షించాలని ఆయన సూచించారు. బుధవారం హైదారాబాద్ గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ కార్యలయం నుంచి అడిషనల్ జాయింట్ డైరెక్టర్ సర్వేశ్వర్ రెడ్డి, జిసిసి జనరల్ మేనేజర్ శంకర్‌నాయక్‌తో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఐటీడీఏల వారిగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన గ్రామాలలోని హ్యాబిటేషన్లు, విద్యా సంస్థలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో అన్ని వసతులతో పాటు మంచినీటి సౌకర్యం తప్పనిసరిగా ఏర్పాటు చేయలన్నారు. భద్రాచలం, టేకులపల్లిలో ఈఎంఆర్ఎస్ పాఠశాలల నిర్మాణం పూర్తయినందున త్వరలో ప్రారంభించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీడీ ట్రైబల్ వెల్ఫేర్ అధికారిని మణెమ్మ, కొండరెడ్ల ప్రత్యేక అధికారి నరేష్, జీసీసీ డీఎం దావీద్, తదితరులు పాల్గొన్నారు.

అర్ధరాత్రి కుమ్మరిగూడెంలో దుర్వాసన

- » హెవీవాటర్ ప్లాంట్ నుంచి హైడ్రోజన్ సల్ఫైడ్ లీకైందని ఆందోళన
- » సందర్శించిన ప్లాంట్ అధికారులు



గ్రామస్థులతో మాట్లాడుతున్న ఆర్ఐ రాజేశ్వరరావు

అశ్వాపురం, సెప్టెంబరు 25: మణుగూరు హెవీవాటర్ ప్లాంట్ ఆఫ్‌సైట్ ఎమర్జెన్సీ పరిధిలోని కుమ్మరిగూడెం గ్రామస్తులు బుధవారం తెల్లవారుజామున కుళ్లిన కోడిగుడ్ల వాసనతో ఇబ్బంది పడ్డారు. గ్రామస్థుల కథనం ప్రకారం మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత గ్రామంలో ఒక్కసారిగా కుళ్లిన కోడిగుడ్ల వాసనతో గ్రామస్తులు స్వల్పంగా వాంతులు,తలనొప్పితో అస్వస్థతకు లోనయ్యారు. దీనికి సమీపంలోని హెవీవాటర్ ప్లాంట్ లోని భారజల ఉత్పత్తి కి సంబంధించి వినియోగించే హెచ్‌టూఎస్ ప్లాంట్ నుంచి హైడ్రోజన్ సల్ఫైడ్ విషవాయువు లీక్ కావటమేనని ఆందోళనకు గురయ్యారు. వెంటనే స్థానికులు ప్లాంట్ అధికారులకు సమాచారం అందించారు. స్పందించిన అధికారులు వెంటనే గ్రామాన్ని సందర్శించి ప్రజలతో మాట్లాడారు. అప్పటికే వాసన ప్రభావం తగ్గిపోవటంతో అధికారులు ఊపిరి పీల్చుకుని వెంటనే చర్యలు చేపట్టారు. గ్రామస్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. కాగా వాసన ప్రభావం నామమాత్రమే కావటంతో ఎటువంటి ప్రాణనష్ట సంఘటనలు చోటుచేసుకోకపోవటంతో గ్రామస్థులు,అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. బుధవారం అశ్వాపురం తహసీల్దార్ స్వర్ణ ఆదేశాలతో ఆర్ఐ రాజేశ్వరరావు గ్రామాన్ని సందర్శించి సంఘటన వివరాలు సేకరించారు. ఈసందర్భంగా గ్రామస్థులు ఆర్ఐకు జరిగిన సంఘటనపై వినతిపత్రం అందజేశారు. వాసనతో కుమ్మరిగూడెం ప్రజలు ఇబ్బందులు పడిన విషయం తమ దృష్టికి వచ్చిందని, వెంటనే తమ ప్లాంట్ అధికారులు గ్రామాన్ని సందర్శించి తగుచర్యలు చేపట్టారని తెలిపారు.

పట్టణాల పారిశుధ్యం మెరుగు పడాలి

- » పారిశుధ్య సిబ్బందిని క్షేత్రస్థాయిలో సంపూర్ణంగా వినియోగించాలి
- » మున్సిపాలిటీల అభివృద్ధి పనులు, పారిశుధ్య నిర్వహణపై కలెక్టర్ సమీక్ష



సమీక్షిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఖమ్మంకలెక్టరేట్, సెప్టెంబరు 25: పట్టణాలలో పారిశుధ్యం మెరుగుపడాలని దీనికి అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ తో కలిసి జిల్లాలోని మున్సిపాలిటీల అభివృద్ధి పనులు, పారిశుధ్య నిర్వహణపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మున్సిపాలిటీల అభివృద్ధి, పరిపాలనలో ప్రాధాన్యం ముందుగా గుర్తించాలని తెలిపారు. పట్టణాల ఎంట్రీ, ఎగ్జిట్ వద్ద చెత్త ఉంటే మనం ఎంత ప్రయత్నం చేసినా పట్టణ పారిశుధ్యానికి మంచి పేరు రాదని కలెక్టర్ తెలిపారు. పట్టణాల్లో చెత్త అధికంగా ఉండే స్పాట్స్ లలో 15 ప్రాంతాలను గుర్తించి వాటిని ముందుగా శుభ్రం చేయాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో ఉన్న మూడు మున్సిపాలిటీలు, ఖమ్మం నగరపాలక సంస్థ పరిధిలో పన్ను వసూలు పై శ్రద్ధ వహించి పూర్తి స్థాయిలో చేయాలని, వాణిజ్య వ్యాపార సంస్థల ప్రాపర్టీ టాక్స్ రీవాల్యుయేషన్ చేయాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో మునిసిపల్ కమిషనర్లు రవి బాబు, అహ్మద్ షఫీఉల్లా, వేణు, మెప్మా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎం గోడౌన్ వద్ద పటిష్ట నిఘా ఉండాలి

ఇవిఎం గోడౌన్ వద్ద పటిష్ట నిఘాతో భద్రతా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ ఆవరణలోని ఈవీఎం గోడౌన్ నెలవారీ తనిఖీ చేశారు. గోడౌన్ సీళ్లను కలెక్టర్ పరిశీలించారు. అగ్నిమాపక పరికరాలు, సీసీ కెమెరాలను పరిశీలించి, పని చేస్తున్నవి, లేనిది అడిగి తెలుసుకున్నారు. భద్రతా సిబ్బంది షిప్టుల వారీగా విధుల గురించి అడిగి తెలుసుకున్నారు. భద్రతా లోపాలు లేకుండా చూడాలన్నారు

‘హైవే’ హారం

(5వ పేజీ తరువాయి)

రూ.2,800 కోట్లతో 2026నాటికి పనులు పూర్తిచేసే లక్ష్యంతో పనులు చేపట్టారు. అమరావతి నుంచి నాగపూర్‌కు ప్రస్తుతం 660 కి.మీ రహదారి పొడవుండగా, గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణం ద్వారా ఆ దూరం రూ.420 కిమీ.కు తగ్గనుంది. ఏపీలోని బందరు, కృష్ణపట్నం కాకినాడ, విశాఖ పోర్టులకు సరుకురవాణ, వ్యవసాయ ఉత్పత్తులు, పలు రకాల పారిశ్రామిక ఉత్పత్తులు ఓడరేవులు ఎగుమతులు, దిగుమతులకు ఈ గ్రీన్‌ఫీల్డ్ హైవే ఉపయోగపడనుంది.

అలాగే ఖమ్మంనుంచి దేవరపల్లికి మరో గ్రీన్‌పీల్డ్ హైవే నిర్మాణం జరుగుతున్నందున నాగపూర్-అమరావతి, దేవరపల్లి జాతీయ రహదారి కూడా చింతకాని మండలం కొదుమూరు, వందనం వద్ద అనుసంధానం కాబోతుంది. ఏపీలోని రాజమండ్రి కాకినాడ, విశాఖపట్నంల నుంచి వచ్చివెళ్లే వాహనాలు అమరావతి-నాగపూర్ జాతీయ రహదారికి ఖమ్మం జిల్లాలోని కొదుమూరు, వందనం వద్ద అనుసంధానం కావడంతో నాగపూర్-అమరావతి జాతీయ రహదారికి రాకపోకలు సౌలభ్యం మరింతగా ఉండనుంది. మంత్రిగా తుమ్మల బాధ్యతలు చేపట్టిన తర్వాత జిల్లాలో భూసేకరణను వేగవంతం చేయించి పనులు ప్రారంభించేందుకు చొరవ తీసుకున్నారు. ఈ గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణం పూర్తయితే మూడురాష్ట్రాల రోడ్డు రవాణా వ్యవస్థలో పెను మార్పులు రానున్నాయి. తెలంగాణలోనే ఖమ్మం జిల్లా నుంచి మంచిర్యాల జిల్లా వరకు 306కి.మీ. సుమారు రూ.7వేల కోట్లతో ఈ రహదారి నిర్మాణమవుతోంది.

ఖమ్మం-కురవి హైవే టెండర్లు పూర్తి

జిల్లాలో ఖమ్మం నుంచి కురవి వరకు మరో జాతీయ రహదారి నిర్మాణం కాబోతోంది. దీనికి నేషనల్ హైవే అధికారులు టెండర్లు పూర్తిచేశారు. రూ.430 కోట్లతో 37 కి.మీ. పొడవునా డబుల్‌లైన్ కింద ఈ జాతీయ రహదారి నిర్మిస్తున్నారు. టెండర్ ప్రక్రియ పూర్తయింది. ఈ జాతీయ రహదారి గ్రానైట్ పరిశ్రమల నుంచి ఉత్పత్తుల రవాణాకు దోహదం చేయనుంది.

ఖమ్మం-కోదాడ, ఖమ్మం-కురవి, సూర్యాపేట-ఖమ్మం, ఖమ్మం-దేవరపల్లి, నాగపూర్-అమరావతి హైవేలతో ఖమ్మం చుట్టూ జాతీయ రహదారుల వలయం ఏర్పడనుంది. దాంతో ఖమ్మంరూరల్ మండలంలోని కాసిరాజు గూడెం, దారేడు మధ్య 6కి.మీ. ఉన్న గ్యాప్‌ను రూ.120 కోట్లతో నాలుగులైన్ల రహదారి నిర్మించనున్నారు. తద్వారా ఖమ్మానికి ఔటర్ రింగ్ రోడ్డు ఏర్పడబోతోంది. అలాగే భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని కొత్తగూడెంనుంచి ఇల్లెందు వలిగొండ మీదుగా హైదరాబాద్‌కు జాతీయ రహదారి నిర్మాణానికి టెండర్లు పూర్తయ్యాయి. ఈ రహదారి నాలుగు లైన్లుగా విస్తరిస్తే భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వాసులు నేరుగా ఇల్లెందు నుంచి హైదరాబాదుకు ప్రయాణం సాగించనున్నారు. అలాగే భద్రాచలం-ఏటూరునాగారానికి కూడా జాతీయ రహదారి ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

పీహెచ్‌సీని సందర్శించిన జిల్లా అధికారి

పెనుబల్లి, సెప్టెంబరు 25: లంకాసాగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా ఇమ్యూనేజేషన్ అధికారి చందూనాయక్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా పిల్లల ఆరోగ్య పరిస్థితులను, అంగన్‌వాడీ కేంద్రంలో జరుగుతున్న హెల్త్ చెకప్‌లను పరిశీలించారు. పిల్లలకు హెల్త్‌క్యాంపు ద్వారా అందుతున్న వైద్యసేవలను స్వయంగా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పీహెచ్‌సీ పరిసరాలను పరిశీలించారు. పలు రికార్డులను పరిశీలించారు. ఫార్మాసిస్టులకు పలు సూచనలు చేశారు. గ్రామాల్లో ప్రతిరోజూ హెల్త్‌క్యాంపులు నిర్వహించాలని డాక్టర్ కిరణ్‌కుమార్‌కు సూచించారు. ఫార్మాసిస్టు డే సందర్భంగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో సీహెచ్‌వో పోలమ్మ, ఏసీడీపీవో మెహరున్నీసాబేగం, సుగుణ, హెల్త్ సూపర్‌వైజర్ నాగేశ్వరరావు, షేక్.బహీరుద్దీన్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనురాధ, మల్లేశ్వరి, రాజ్యలక్ష్మీ, కుమారి పాల్గొన్నారు.

‘మహోన్నతుడు బర్దన్’

ఖమ్మంటౌన్, సెప్టెంబరు 25: కమ్యూనిస్టు సిద్ధాంతాన్ని ఆచరణలో చూపిన మహోన్నతుడు ఆర్‌డీ. బర్దన్ అని సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ పేర్కొన్నారు. బర్దన్ శతజయంతి సందర్భంగా బుధవారం సీపీఐ జిల్లా కార్యాలయం గిరిప్రసాద్ భవన్‌లో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు జమ్ముల జితేందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన శతజయంతి సభలో పోటు ప్రసాద్ మాట్లాడుతూ యుక్తవయస్సు నుండే వామపక్ష భావాన్ని అలవర్చుకున్న బర్దన్ ఏఐఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షుడిగా, కార్యదర్శిగా పనిచేశారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు యర్రా బాబు, కొండపర్తి గోవిందరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు బీజి.క్లైమెంట్, తాటి వేంకటేశ్వరరావు, రావి శివరామకృష్ణ పాల్గొన్నారు.

13వ డివిజన్‌లో సభ్యత్వ నమోదు

ఖమ్మంబైపాస్‌రోడ్, సెప్టెంబరు 25: దీన్‌దయాల్ ఉపాధ్యాయ జన్మదినం సందర్భంగా బీజేపీ అర్బన్ టౌన్ అధ్యక్షుడు కుమలి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బుధవారం నగరంలోని 13వడివిజన్‌లో బీజేపీ సభ్యత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమాన్ని పార్లమెంట్ కంటస్టెడ్ అభ్యర్థి తాండ్ర వినోదరావు పాల్గొని ప్రారంభించారు. ఈకార్యక్రమంలో కంపసాటి అంజన్న అశ్విని, అసెంబ్లీ కన్వీనర్ అల్లిక అంజయ్య, మంద సరస్వతి, వేల్పుల సుధాకర్, సాంబశివరావు పాల్గొన్నారు.

భూ-చోళ్లు

పినపాక రెవెన్యూలో కదిలిన అక్రమాల పుట్ట

- » తహసీల్దార్‌పై వేటు
- » విచారణతో వెలుగులోకొస్తున్న వ్యవహారాలు
- » గతంలోనే భారీగా అక్రమాలు
- » బీటీపీఎస్ రాకతోనే భూముల అన్యాక్రాంతం



పినపాక తహసీల్దార్‌పై వేటు

పినపాక, సెప్టెంబరు 24: పినపాక ప్రధానంగా వ్యవసాయాధారిత మండలం. పినపాక నియోజకవర్గంలో బూర్గంపాడు తాలుకాగా ఉన్నప్పటి నుంచి ఇక్కడి భూములు వ్యవహారం రెవెన్యూ శాఖకు పెద్ద తలనొప్పే. ఏజెన్సీ ప్రాంతం కావడంతో భూములు కొనుగోళ్లు, అమ్మకాలు జరుగుతున్నప్పటికీ అవన్నీ తాత్కాలిక అనధికార వ్యవహారాలే. అయితే గిరిజనుల భూములు మినహాయించి మిగతా ఎస్సీ, బీసీ, ఓసీ ల భూముల క్రయవిక్రయాలు యథాతథంగానే సాగుతున్నాయి. ఇందులో వారసత్వాలు, ఇనాం భూములు ఉన్నాయి. ఇటీవల భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ రాకతో భూములకు కొంత డిమాండ్ వచ్చింది. పవర్ ప్లాంట్ ఏర్పాటుకు భూసేకరణ చేయడం, ఉన్న భూమినే విడగొట్టి కుటుంబ సభ్యులకు భాగాలు పంచి, కొంతమంది ప్యాకేజ్‌లు తీసుకోవడం, కొందరు ఉద్యోగాల కోసం పట్టుబట్టి సాధించుకోవడం జరిగింది. భద్రాద్రి పవర్ ప్లాంట్ రాకతో అయితే భూముల అక్రమాలకు తెరలేచింది.

పినపాక మండలంలోని ఏడూళ్లబయ్యారం రెవెన్యూలోని కంది బ్రహ్మారెడ్డి కంది ప్రసాద్‌రెడ్డిలకు భూ పంపకాల్లో గతంలోనే కుటుంబ వివాదాలు ఉన్నాయి. తాజాగా కంది బ్రహ్మారెడ్డి, ప్రసాద్‌రెడ్డిలకు పాలిభాగస్తులుగా భూమి సర్వే నెం 17, 18 లలో ఉన్నారు. తనకు వచ్చిన 2 ఎకరాల 09 కుంటల భూమి వాటాలో ప్రసాద్‌రెడ్డి తన సోదరి కమలకు ఎకరం భూమి బదలాయించగా, ఒక ఎకరం తన పేర ఉంది. అదనంగా ఉన్న 17 ఏఏ, సర్వే నెంబర్‌లోని భూమి 09 కుంటల భూమితో కొంత కలిపి, తనకు బంధుత్వం లేని వ్యక్తికి పట్టా మార్పిడి చేశారు. ఇందుకు ఏజెన్సీ నిబంధనలకు విరుద్ధంగా వారసత్వం లేని వ్యక్తికి పట్టా చేశారని కంది బ్రహ్మారెడ్డి అనే వ్యక్తి కోర్టును ఆశ్రయించాడు. కోర్టు ఆదేశాలతో విచారణ చేపట్టిన కలెక్టర్, తహసీల్దార్ చేసిన తప్పును గుర్తించి, తహసీల్దార్ సూర్యనారాయణను సస్పెండ్ చేసి చర్యలు తీసుకున్నారు. వారికి పట్టా ఇచ్చినట్లుగానే తమకు కూడా వారసత్వ పట్టా(మరో చోట భూమికి) ఇవ్వాలని పట్టుబట్టిన నేపథ్యంలో, పట్టా ఇవ్వడం కుదరదని తహసీల్దార్ నిరాకరించడంతో వివాదం ప్రారంభమైదని తెలుస్తోంది.

జానంపేట, ఏడూళ్లబయ్యారం, దుగినేపల్లి, ఉప్పాక రెవెన్యూ గ్రామాల్లోనే భూ పట్టాల మార్పిడి విపరీతంగా జరిగిందని, కొందరు బడా రాజకీయ నాయకులు, పెట్టుబడిదారులు తమ భూములను ఓ మధ్యవర్తి ద్వారా సాదాబైనామాలతో రికార్డుల్లోకి చేరి, ధరణితో పట్టాదారు పాసు పుస్తకాలు పొందారని, ఆనాడు జరిగిన అవినీతి అక్రమాలతో పోలిస్తే, ఇది గోరంతేనని, జిల్లా కలెక్టర్ 2013, 2014 నాటి నుంచి జరిగిన భూ మార్పిడి పూర్వ రికార్డులను పరిశీలిస్తే రెవెన్యూ శాఖలో తిమింగలాలు బయటకొస్తాయని ప్రజలు కోరుతున్నారు.

పేరుకుపోతున్న దస్త్రాలు

వారం క్రితం పినపాక తహసీల్దార్ సూర్యనారాయణ బదిలీ అయ్యారు.. ఆ వెంటనే సస్పెన్షన్ వేటు వేశారు. నూతన తహసీల్దార్‌గా చందా నరేష్ కు నియామక ఉత్తర్వులు ఇచ్చారు. వాటిని నిలిపి వేసి, భద్రాచలం ఐటీడీఏ ఏపీవో అద్దంకి నరేష్‌కు తహసీల్దార్‌గా పోస్టింగ్ ఇచ్చారు. రిలీవర్ రాకపోవడంలో వారి స్థానాల నుంచి ఏ ఒక్కరూ కూడా కదలక పోవడంతో పినపాకలో తహసీల్దార్ కుర్చీ ఖాళీగా ఉంది. ప్రజలు దరఖాస్తులు, భూ దస్త్రాలు పెండింగ్‌లో పడి ఉండడంతో ఇబ్బందులు పడుతున్నారు.

ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో మాతా శిశు ఆరోగ్య కేంద్రం (ఎంసీహెచ్) అస్తవ్యస్తంగా తయారైంది. గత కొన్ని రోజులనుంచి డ్రైనేజీ నుంచి మురుగు నీరు బయటకు ఉబికి వస్తుండడంతో పరిసరాలు దుర్వాసన వెదజల్లుతున్నాయి. చాలాకాలంగా ఈ సమస్య వేధిస్తున్నా, ఇటీవల డ్రెయినేజీ మరమ్మతులకు నిధులు కేటాయించడంతో పనులు కొనసాగుతున్నాయి. దీంతో పాటు పైపుల నుంచి వచ్చే లీకేజీలు, అండర్ గ్రౌండ్‌లోని పైపుల నుంచి వచ్చే మురుగునీటితో ఎంసీహెచ్ పరిసరాలు అధ్వానంగా ఉన్నాయి. పారిశుధ్య కార్మికులు తాత్కాలికంగా వాటిని తొలగిస్తున్నా.. సమస్య మాత్రం నిత్యకృత్యమవుతోంది. మురికి వ్యర్థాలు, దుర్గంధం నడుమ రోగులు ఆస్పత్రికి వైద్య సేవల కోసం రావాల్సి వస్తోంది.


మాతా శిశు ఆరోగ్య కేంద్రం

ఎంసీహెచ్‌లో సమస్యల జబ్బు

- అరకొరగా వైద్య సిబ్బంది
- భవనం గోడల పైనుంచి లీకవుతున్న మురుగు నీరు
- అస్తవ్యస్తంగా పారిశుధ్య నిర్వహణ

ఖమ్మంకలెక్టరేట్, సెప్టెంబరు 25: ఎంసీహెచ్‌లో పరిశుభ్రంగా ఉంచుకునే విషయంలో మాత్రం పట్టించుకోవడం లేదు. భవనం నిర్మించిన సమయాన అండర్‌డ్రెయినేజీ పైపులైన్ సరిగా లేకపోవడం వల్లే మురుగునీరు ఉబికి వస్తున్నట్లు కార్మికులు చెబుతున్నారు. చాలా చోట్ల పైఅంతస్తుల నుంచి మురుగు నీరు పైపుల ద్వారా బయటకు లీకవుతోంది. ఆస్పత్రి ఆవరణ రోగుల చెప్పులతో దర్శనం ఇస్తోంది.

రాష్ట్రస్థాయిలో గుర్తింపు ఉన్నా...

పెద్దాస్పత్రిలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రాన్ని 2018లో అందుబాటులోకి తీసుకొచ్చారు.. చిన్నారులు, మహిళలు, గర్భిణులు, బాలింతల కోసం ఏర్పాటు చేసిన ఆస్పత్రిలో 150 పడకలు అందుబాటులో ఉన్నాయి. కాగా, గత ఆరేళ్ల కాలంలో రోగుల తాకిడి మరింతగా పెరగడంతో వైద్య సేవలకు అవి ఏ మాత్రం సరిపోవట్లేదు. దీంతో అధికారులు ఆస్పత్రి స్థాయిని మరో 100 పడకలకు పెంచాలని ఉన్నతాధికారులకు ఎన్నోమార్లు నివేదికలు పంపించారు. ఇక్కడికి ఉమ్మడి జిల్లా నుంచే కాకుండా సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాలు, సరిహద్దు రాష్ట్రం నుంచి కూడా రోగులు వస్తుంటారు. ప్రతి నిత్యం చిన్నపిల్లల ఓపీ 150, గర్భిణుల ఓపీ 300 నుంచి 400 వరకు ఉంటుంది. ఇక్కడే టిఫీ స్కానింగ్, స్కానింగ్, గైనకాలజిస్టులు పరీక్షలు నిర్వహిస్తుంటారు. ప్రధానంగా ఇక్కడ అత్యంత ప్రధానంగా రేడియాలజిస్టులు లేకపోవడంతో స్కానింగ్, టిఫాస్కానింగ్‌లు మూలనపడిపోయాయి. మొత్తం ఐదుగురు రేడియాలజిస్టులు ఉండాల్సి ఉండగా, కనీసం ఒక్కరంటే ఒక్కరూ కూడా లేరు. గైనకాలజిస్ట్ విభాగంలోనూ


ఆస్పత్రి గోడలపైనుంచి లీకవుతున్న నీరు


ఆస్పత్రి పరిసరాల్లో మురుగునీరు

మాతా శిశు సంరక్షణ కేంద్రంలో సౌకర్యాల కరువు

అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఇతరత్రా మొత్తం 36 మంది వైద్యులు ఉండాల్సి ఉండగా, కనీసం 10 మంది మాత్రమే ఉన్నారు. ఇక చిన్నపిల్లల విభాగంలోనూ పడకలు 30, పీఐసీయూలో 20 పడకలు ఏమాత్రమూ సరిపోవడం లేదు. ఆర్థోపెడిక్, జనరల్ మెడిసిన్, పిడియాట్రిషియన్, గైనిక్, సైక్రియాటిస్ట్, ఆప్తాలమిస్ట్, ఈఎన్టీ విభాగాల్లో కనీసం ఎస్ఆర్‌లు కూడా లేకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

మరో అంతస్తు ఉంటేనే..!

ఇక్కడ ప్రతినిత్యం 25నుంచి 30కాన్పులు జరుగుతుంటాయి. సీ సెక్షన్ ఇన్‌పేషంట్లుగా ఉండాలంటే మెటర్నిటీ వార్డు 1, 2లో కలిపి మొత్తం 150పడకలు మాత్రమే ఉన్నాయి. దీంతోపాటు కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు నిర్వహిస్తుంటారు. ఈ నేపథ్యంలో వరండాల్లోనే రోగులను పడుకోబెడుతున్నారు. మరో అంతస్థు ఉంటే తప్ప ఎంసీహెచ్‌లో గర్భిణులకు, బాలింతలకు అవస్థలు తప్పడంలేదు. కాగా మరుగుదొడ్లు కూడా అధ్వానంగా ఉన్నాయని రోగులు పేర్కొంటున్నారు. ఇదే విషయమై పలుమార్లు ఉన్నతాధికారులకు విన్నవించినా పట్టించుకోవలేదు. ఇటీవల డ్రైనేజీ, మూత్రశాలలకు కలిపి రూ.35లక్షల నిధులు మంజూరుకావడంతో పనులను చేపట్టారు. ప్రస్తుతం టీఎస్ఎంఐడీసీ అధికారులు ఈ పనులను చేపట్టారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు మాతాశిశు ఆరోగ్య కేంద్రంపై ప్రత్యేక దృష్టి సారించి, ఇక్కడి సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.

పనులు కొనసాగుతున్నాయి: డాక్టర్ బీ. రత్నాకర్, సూపరింటెండెంట్, ఎంసీహెచ్



ప్రస్తుతం మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో డ్రెయినేజీ పనులు కొనసాగుతున్నాయి. సంప్ నిర్మాణం, మూత్రశాలల నిర్మాణం, పారిశుధ్యం పనులను చేపట్టాం. మరో నెలరోజుల్లో ఇవి పూర్తి అవుతాయని భావిస్తున్నాం. ప్రధానంగా రేడియాలజిస్టులు లేకపోవడం బాధాకరం. ఇక్కడికి కనీసం ఐదుగురు రేడియాలజిస్టులు అవసరం ఉంటుంది. దీనిపై ప్రభుత్వానికి నివేదించాం. పూర్తిస్థాయిలో మరో అంతస్తు నిర్మాణం జరిగితే ఇక్కడ రోగుల ఇబ్బందులు తీరుతాయి.


స్థలాలను పరిశీలిస్తున్న కమిషనర్ అభిషేక్ అగస్త్య

ప్రభుత్వ స్థలాలను పరిశీలించిన కేఎంసీ కమిషనర్

ఖమ్మం సంక్షేమవిభాగం, సెప్టెంబరు 25: ఖమ్మం నగరానికి నలువైపులా ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాలను, ఆక్రమణలకు గురైన స్థలాలను కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్ అధికారుల బృందంతో కలిసి బుధవారం పరిశీలించారు. ఖమ్మం నగరంలో నూతనంగా ఖానాపురం అర్బన్ ఆరోగ్య కేంద్రం, ధంసలాపురంలో మురుగు నీరు శుద్ధి కేంద్రాలను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చొరవతో ప్రభుత్వం మంజూరు చేసింది. కాగా వీటి నిర్మాణానికి ప్రభుత్వం శాశ్వత భవనాలకు నిధులు మంజూరు చేసింది. దీంతో కమిషనర్ అభిషేక్ అగస్త్య ఖానాపురం, ధంసలాపురం, బైపాస్ రోడ్డులోని ప్రభుత్వ స్థలాలను, ఆక్రమిత ప్రభుత్వ స్థలాలను పరిశీలించారు. అసిస్టెంట్ కమిషనర్ సంపత్‌కుమార్, ఎస్ఈ రంజిత్‌కుమార్, ఈఈ కృష్ణలాల్, డీసీపీ వికాస్, ఏసీపీ వసుంధర, ఇతర అధికారులు పాల్గొన్నారు.


ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి చెక్కు అందిస్తున్న శ్రీధర్

వరద బాధితుల కోసం రూ.25 లక్షల విరాళం

ముఖ్యమంత్రికి అందించిన శ్రీచైతన్య విద్యాసంస్థల చైర్మన్

ఖమ్మం ఖానాపురంహవేలి సెప్టెంబరు 25:ఇటీవల వచ్చిన భారీ వరదలకు సర్వం కోల్పోయిన కుటుంబాలకు చేయుత నిచ్చేందుకు వరద బాధితుల సహాయనిధికి తెలంగాణ శ్రీచైతన్య విద్యా సంస్థల యాజమాన్యం రూ.25 లక్షల విరాళాన్ని అందించారు. బుధవారం తుమ్మల యుగంధర్‌తో కలిసి హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాసంలో కలిసి రూ.25లక్షల చెక్కును ముఖ్యమంత్రి సహాయనిధికి అందించారు. సామాజిక బాధ్యతలోనూ శ్రీచైతన్య విద్యాసంస్థలు ముందుంటాయని విద్యాసంస్థల చైర్మెన్ శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్యలు తెలిపారు. మా విద్యాసంస్థలో పనిచేస్తున్న పలువురు వరదల్లో నష్టపోయిన సిబ్బందికి రూ.10లక్షల ఆర్థిక సహాయం, విద్యార్థులకు పుస్తకాలు అందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అభినందించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ రవితేజ్, చేతన్‌మాధుర్ పాల్గొన్నారు.

నేషనల్ ఫెడరేషన్ వర్కింగ్ కమిటీ మెంబర్‌గా అప్పారావు

ఖమ్మం ఖానాపురంహవేలి సెప్టెంబరు 25: నేషనల్ ఫెడరేషన్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్క్స్, ఫెడరేషన్ వర్కింగ్‌కమిటీ మెంబర్‌గా టీజీఎస్ ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ పాటి అప్పారావును ఎన్నుకున్నారు. కర్నాటక రాష్ట్రం బెంగుళూరులో ఈనెల 23, 24, 25 తేదీల్లో జరిగిన మహాసభల్లో 29 రాష్ట్రాల నుంచి 400మంది ప్రతినిధులు పాల్గొన్ని 75మందితో కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్టు అప్పారావు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం నుంచి 20మంది ప్రతినిధులు హాజరైనట్టు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు అప్పారావును అభినందించారు.

యువత స్వామి వివేకానంద జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలి

జిల్లా స్థాయి యువజనోత్సవాల్లో కలెక్టర్

కొత్తగూడెం పోస్టాఫీస్‌సెంటర్, సెప్టెంబరు 25: యువత స్వామి వివేకానంద జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని.. సంప్రదాయ కళల్లో రాణించాలని భద్రాద్రి జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. బుధవారం కొత్తగూడెం క్లబ్‌లో జరిగిన జిల్లాస్థాయి యువజనోత్సవాల్లో భాగంగా జిల్లా క్రీడా, యువజన శాఖ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జ్యోతి ప్రజ్వలన చేసి వివేకానంద చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత పైన అపారమైన భారం ఉంటుందని, ఏదైనా యువతతోనే సాధ్యమని, దానికి అనుగుణంగా యువత ముందుకు సాగాలన్నారు. కొమురం భీం ఇదే అటవీ ప్రాంతంలో తిరిగారన్నారు. అదేవిధంగా రుద్రమదేవి ఆనవాళ్ళు చంద్రుగొండ గుట్టలపైన ఇంకా కనబడుతున్నాయని, శక్తివంతమైన వ్యక్తులు శక్తివంతమైన ప్రాంతం నుంచి వస్తారని వారిని స్ఫూర్తిగా తీసుకొని యువత జిల్లాను ఇంకా అభివృద్ధి పరచాలని కోరారు. స్వామి వివేకానంద ప్రసంగాల ద్వారా యువత ఆకర్షితులై పెద్దఎత్తున స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నారని తెలిపారు. స్వాతంత్ర్య సమరయోధుల జీవితాలను స్ఫూర్తిగా తీసుకొని యువత మంచి ఆరోగ్యం, దేశాభివృద్ధికి తోడ్పడాలని కలెక్టర్ కోరారు. అనంతరం యువజన ఉత్సవాలు ఏర్పాటు చేసిన సైన్స్ ఫెయిర్ స్టాల్స్‌ను పరిశీలించి విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీవో విద్యాచందన, డీవైఎస్‌వో పరందామరెడ్డి, జిల్లా సైన్స్ ఫెయిర్ అధికారి చలపతిరావు, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి వెంకటేశ్వర్లు, మైనింగ్ కళాశాల ప్రిన్సిపాల్ జగన్మోహన్‌రాజు, సిబ్బంది లక్ష్మయ్య, తిరుమలరావు, ఇమామ్, జిల్లావ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ ప్రైవేటు కళాశాల అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


వివేకానంద చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

క్రైం సమాచారం

పురుగుల మందు తాగి యువకుడి మృతి

అశ్వాపురం, సెప్టెంబరు 25: మండల పరిధిలోని మామిళ్లవాయి గ్రామానికి చెందిన ఓయువకుడు పురుగుల మందు తాగాడు. మామిళ్లవాయి గ్రామానికి చెందిన సోయం సతీష్ (20) తల్లితండ్రులు లేకపోవటంతో గ్రామంలోని బంధువుల వద్ద ఉంటున్నాడు. ఈనేపథ్యంలో మద్యానికి బానిసయ్యాడు. మంగళవారం మద్యం మత్తులో పురుగుల మందు తాగాడు. బంధువులు చికిత్స నిమిత్తం కొత్తగూడెంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుని బంధువుల పిర్యాదు మేరకు అశ్వాపురం పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి ..

చింతకాని, సెప్టెంబరు 25: గుర్తు తెలియని వ్యక్తి రైలు కింద పడి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని పందిళ్లపల్లి- చింతకాని రైల్వే స్టేషన్ల మధ్య బుధవారం చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. కి.మీ నెంబర్ 497/20-22 డౌన్ లైన్ ట్రాక్ ప్రక్కన గుర్తు తెలియని రైలు నుంచి ప్రమాదవశాత్తు జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. మృతుడి ఎత్తు 5.5 ఉంటుందని, చామనచాయ రంగులో గుండ్రని ముఖం కలిగి నల్లని వెంట్రుకలు కుడి చాతిపై పుట్టుమచ్చ కలదన్నారు. తెల్లని బనియన్, నల్లని లోయర్ ధరించి ఉన్నాడు. మృతుని వద్ద ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో అన్నం ఫౌండేషన్ బాధ్యుడు శ్రీనివాసరావు సిబ్బంది సహాయంతో మృతదేహాన్ని ఖమ్మం మార్చురీకు తరలించినట్లు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీస్‌లు తెలిపారుు.

చికిత్స పొందుతూ మేకల కాపరి ..

సత్తుపల్లిరూరల్, సెప్టెంబరు 25: మేకలను మేపుకుని తిరిగి ఇంటికెళ్తుండగా కారు ఢీకొన్న ప్రమాదంలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతిచెందిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. మంగళవారం సాయంత్రం మండలంలోని కాకర్లపల్లికి చెందిన కొప్పుల చెన్నారావు (53) మేకలను భార్య కుమారితో కలిసి మేపుకుని ఇంటికి వెళ్తున్న క్రమంలో రుద్రాక్షపల్లి నుంచి వస్తున్న కారు ఢీకొంది. తీవ్రగాయాలైన చెన్నారావును విజయవాడలోని ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉండగా పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

25 కిలోల గంజాయి స్వాధీనం

ఖమ్మం సంక్షేమ విభాగం, సెప్టెంబరు 25: భారీగా గంజాయిని తరలిస్తున్న వ్యక్తిని ఖమ్మం ఎక్సైజ్‌శాఖ అధికారులు చాకచక్యంగా పట్టుకున్నారు. ఒడిసా రాష్ట్రానికి చెందిన ముత్తు సునీల్‌బాబు గంజాయిని మూటలో కట్టి ఒడిసా నుంచి భద్రాచలం చేరుకొన్నాడు. అక్కడ నుంచి ఆర్టీసీ బస్సులో హైదరాబాద్‌కు ప్రయాణం ప్రారంభించాడు. ముందస్తు సమాచారం మేరకు ఖమ్మం ఎక్సైజ్ ఏఈఎస్ వేణుగోపాల్ ఆధ్వర్యంలో టాస్కఫోర్స్ బృందం బుధవారం ఖమ్మం శ్రీశ్రీ సర్కిల్, ఎన్టీఆర్ సర్కిల్, కొత్త బస్టాండ్‌లో మూడు బృందాలుగా మకాం వేశారు. భద్రాచలం నుంచి హైదరాబాద్‌కు బస్సులో ప్రయాణిస్తున్న ముత్తు సునీల్‌తో పాటుగా 25 కిలోల ఎండు గంజాయిని ఎక్సైజ్ అధికారులు స్వాధీం చేసుకున్నారు. ఈ దాడిలో సీఐ కరుణ, ఎస్ఐ సరిత, హెడ్ కానిస్టేబుల్స్ మధు, రాములు కానిస్టేబుల్స్ నాగేశ్వరరావు, లాజర్, విశ్వనాధం, నరేశ్‌కుమార్, కృష్ణవేణి, నిర్మల పాల్గొన్నారు

12 కిలోల గంజాయి ...

మణుగూరు, సెప్టెంబరు 25: ఎక్సైజ్ శాఖ ఎన్‌ఫోర్స్ మెంట్ అధికారులు ఎక్సైజ్ స్టేషన్ పరిధి అధికారులు సంయుక్తంగా నిర్వహించిన తనిఖీల్లో బుధవారం 12కిలోల గంజాయిని పట్టుకున్నారు. మణుగూరు పట్టణంలోని హనుమాన్ టెంపుల్ ఏరియాలో రెండు బైక్‌లపై నలుగురు వ్యక్తులు 12కిలోల గంజాయిని ఒరిసా నుంచి మహబూబాబాద్‌కు తరలించే ప్రయత్నం చేశారు. అధికారులు అనుమానంతో తనిఖీ చేయడా గంజాయి లభ్యమైంది.

ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్ల పట్టివేత

చంద్రుగొండ, సెప్టెంబరు 25: సీతాయిగూడెం సమీపంలోని ఎదుళ్ల వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను చంద్రుగొండ పోలీసులు పట్టుకొని స్టేషన్‌కు తరలించారు. ఎస్ఐ స్వప్న బుధవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మంగళవారం రాత్రి పాట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఎదుళ్ల వాగులో నుంచి ఇసుక లోడుతో వస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు తెలిపారు. ట్రాక్టర్లతో పాటు నిర్యాహకులు బిక్షం, కోటేశ్వరావు, వెంకటేశ్వర్లుపై కేసు నమోదు చేసినట్లు వివరించారు

'ఎత్తిపోతలకు' చోరీల షాక్

- ట్రాన్స్‌ఫార్మర్ల కాపర్ వైరు చోరీతో నిరుపయోగం
- నాలుగు నెలల నుంచి పని చేయని పథకాలు

కల్లూరు, సెప్టెబరు 25: నాగార్జున్ సాగర్ ఎడమకాల్వపై ఎత్తి పోతల పథకాలకు వింత సమస్య ఎదురవుతోంది. ట్రాన్స్‌ఫార్మర్లలో కాపర్ వైరును గుర్తుతెలియని వ్యక్తులు అపహరిస్తుండటంతో అవి నిరుపయోగంగా మారుతున్నాయి. చోరీ జరిగి ఏడు నెలలు కావస్తున్నా ఇంత వరకు జలవనరుల శాఖ అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోలేదు. కల్లూరు మండల పరిధిలో బత్తుపల్లి, కప్పలబంధం, నారాయణపురం గ్రామాల పరిధిలో గల ఎత్తిపోతల పథకాలు సాగర్ జలాలను పంట పొలాలకు అందిస్తుంటాయి. సాగర్ కాల్వపై లిఫ్టల పంపింగ్ హౌజ్‌ల వద్ద ఏర్పాటు చేసిన 400 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్ వైరును గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. వెంటనే రైతులు పోలీసులకు, జలవనరుల శాఖకు పిర్యాదు చేశారు. అయితే దొంగలను గుర్తించక పోగా, నూతన ట్రాన్స్‌ఫార్మర్లను కూడా అధికారులుఏర్పాటు చేయలేదు.

లిఫ్టలను పట్టించుకోరా..

సాగర్ కాల్వపై ఉన్న లిఫ్టల పరిధిలో మొత్తం మీద మూడే వేల ఎకరాల్లో వరి సాగవుతోంది. వీటి పరిధిలో కప్పలబంధం, బత్తుపల్లి, నారాయణపురం, శ్రీరాంపురం, ఖాన్‌ఖాన్‌పేట గ్రామాల పరిధిలో 1000 మందికి పైగా గిరిజన, ఎస్సీ, బీసీ వర్గాలకు చెందిన రైతులే ఉన్నారు. ఈ వానకాలం సీజన్‌లో ప్రారంభమైనా అధికారులు లిఫ్టల నిర్వహణపై దృష్టి సారించలేదు. ఆయా శాఖ అధికారుల అవగహనలోపం, సమన్వయం లేక పోవటంతో ఈ పరిస్థితి దాపురించిందని పలువురు రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



బత్తులపల్లిలో పనిచేయని ఎత్తిపోతల పథకం

వ్యవసాయ శాఖ మంత్రి దృష్టికి...

పలు మార్లు అధికారులకు పిర్యాదు చేసినా ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయకపోవడంతో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు వివరించినట్లు రైతులు జాస్తి శ్రీనివాసరావు, కర్నాటి జయబాబు రెడ్డి, తల్లపురెడ్డి అనిమి రెడ్డి తెలిపారు. అసలే గత ఏడాది వర్షాభావ పరిస్థితితో పంటలు కోల్పోగా ఈ ఏడాది కూడ సాగునీరు అందటం కష్ట సాధ్యంగా మారిందన్నారు. ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయడంలో జాప్యంతో బాధిత రైతులు రోజువారి అద్దెలు చెల్లించి ప్రైవేటు వ్యక్తుల నుంచి కిరాయికి తెచ్చుకోవాల్సిన పరిస్థిత్థితి ఏర్పడిందని కప్పలబంధం రైతులు వాపోతున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల కోసం రైతుల ధర్నా...

కల్లూరు, సెప్టెంబరు 25 బత్తులపల్లి గ్రామం లిఫ్ట్ పరిధిలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాలని జలవనరులశాఖ అధికారులను డిమాండ్ చేస్తూ కల్లూరులో బుధవారం ఆయకట్టు రైతులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా లిఫ్ట్ రైతు ప్రతినిధులు టి. హనిమిరెడ్డి, జాస్తి శ్రీనువాసరావువిలేకరులతో మాట్లాడారు. గత ఏడు నెలల క్రితం విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో కాపర్ వైరు చోరి కావటంతో నాటి నుంచి లిఫ్ట్ పనిచేయక సాగునీరు అందిని పరిస్థితి ఏర్పడిందన్నారు. బత్తులపల్లి లిఫ్ట్ పరిధిలో గల విద్యుత్ ట్రాన్స్‌పార్మర్ సామర్థ్యం 400 కేవి కాగా దానిలో స్థానంలో 250 కేవీ సామర్థ్యం ట్రాన్స్‌పార్మర్ ఏర్పాటు చేస్తామని చెప్తున్నారని వారు తెలిపారు.


ఎస్ఈకి వినతిపత్రం సమర్పిస్తున్న రైతులు

త్వరలో ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తాం: ఈఈ

సాగర్ కాల్వపైన కప్పలబంధం, నారాయణపురం గ్రామాల పరిధిలో గల ఎత్తిపోతల పథకాలకు గాను త్వరలో ఆధునీకరణ చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తామని ఈఈ లక్ష్మీనారాయణ బుధవారం తెలిపారు. పాత టెండర్లను రద్దు చేసి కొత్త ఏజెన్సీలను ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు సంప్రదించామని తెలిపారు.

లిఫ్టులు పనిచేయట్లే...

పెనుబల్లి, సెప్టెంబరు 25: నాగార్జునసాగర్ కాల్వ ఎంతనే ఉన్నప్పటికీ ఎత్తిపోతల పథకాలు పనిచేయకపోవడంతో పంటపొలాలకు నీరు చేరడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాగర్ కాల్వపై మండలంలోని టేకులపల్లి, తాళ్లపెంట, పెనుబల్లి, బయ్యన్నగూడెం, కారాయిగూడెం గ్రామాల పరిధిలో ఎత్తిపోతల పథకాలను ఏర్పాటుచేశారు. వీటిలో తాళ్లపెంట ఎత్తిపోతల పథకం ద్వారా సుమారు మూడువేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. దీనితో పాటు పెనుబల్లి ఎత్తిపోతల పథకం ద్వారా 1800ఎకరాలకు సాగునీరందుతుంది. పెనుబల్లి, తాళ్లపెంట ఎత్తిపోతలకు అమర్చిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలో రాగి వైర్లను గత మార్చి ఐదోతేదీన గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. అప్పటి నుంచి ట్రాన్స్‌ఫార్మర్లకు మరమ్మతులు చేపట్టి పంటపొలాలకు సాగునీరు ఇవ్వాలని రైతులు కోరుతున్నారు. గత రెండురోజులుగా సాగర్‌కాల్వకు నీటిని విడుదల చేశారు. పెనుబల్లి ప్రాంతానికి సాగర్‌నీరు చేరినప్పటికీ ఎత్తిపోతల పథకాలకు మరమ్మతులు చేపట్టకపోవడంతో చెంతనే నీరున్నా పొలాలకు చేరే దారి లేదని రైతులు వాపోతున్నారు. తాళ్లపెంట, పెనుబల్లి ఎత్తిపోతల పథకాలకు సంబంధించి ట్రాన్స్‌ఫార్మర్లలో రాగి వైర్ చోరీకి గురైన విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేశామని ఐబీ ఏఈ కిరణ్‌కుమార్ తెలిపారు. ఒక్కొక్క ట్రాన్స్‌ఫార్మర్‌కు రూ.ఐదులక్షల చొప్పున ప్రతిపాదనలు పంపామని, నిధులు మంజూరయ్యాక కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తామని తెలిపారు.


చోరీకి గురైన తాళ్లపెంట ట్రాన్స్‌ఫార్మర్

ట్రాక్టర్ బోల్తా.. డ్రైవర్ మృతి

అశ్వారావుపేట, సెప్టెంబరు 25 : పామాయిల్ గెలలతో వెళుతున్న ట్రాక్టర్ బోల్తాపడి డ్రైవర్ మృతి చెందిన ఘటన పాపిడిగూడెం గ్రామ సమీపంలో బుధవారం జరిగింది. అశ్వారావుపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఏపీలోని ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మండలం కామయ్యపాలెం గ్రామానికి చెందిన డ్రైవర్ కొత్తపల్లి వెంకటేశ్వరరావు (22) కామయ్యపాలెం నుంచి పామాయిల్ గెలలను అశ్వారావుపేట ఫ్యాక్టరీకి తీసుకువస్తుండగా ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తాపడింది. ఈఘటనలో డ్రైవర్ ట్రాక్టర్ చక్రం క్రింది పడి మృతి చెందాడు. మృతుడి తల్లి వరలక్ష్మి పిర్యాదు మేరకు ఎస్ఐ శివరామకృష్ణ కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.



బోల్తాపడిన ట్రాక్టర్ 7

కొలిక్కిరాని డంపింగ్ యార్డు సమస్య

- పారిశుధ్య వాహనాలను అడ్డుకున్న స్థానికులు
- పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన కేఎంసీ అధికారులు

ఖమ్మం సంక్షేమ విభాగం, సెప్టెంబరు 25: మున్నేరు వరద ముంపు ప్రాంతంలోని వ్యర్థాలను డంపింగ్ యార్డుకు తరలించడంతో సమీపంలో ఉన్న ప్రాంతాల ప్రజలు పారిశుధ్య వాహనాలను అడ్డుకుంటున్నారు. ప్రజలు దుర్వాసన వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో రోజు వారీగా నిరసన కార్యక్రమాలు చేపట్టారు. డంపింగ్‌యార్డుకు వెళ్లే పారిశుధ్య వాహనాలను బుధవారం కూడా అడ్డుకున్నారు. దీంతో కేఎంసీ అధికారులు పోలీసు స్టేషన్‌లో నిరసనకారులపై ఫిర్యాదులు చేశారు. చెత్త వ్యర్థ పదార్థాలతోనే పారిశుద్య వాహనాలు నిలిచిపోయాయి. ఈ క్రమంలో స్థానికులకు రాజకీయ పార్టీలు అండగా నిలిశాయి.


ఆందోళన చేస్తున్న స్థానికులు



వెంకటేశ్వర్‌రెడ్డి ఆశయాలు సాధించాలి: మంత్రి తుమ్మల

తల్లాడ, సెప్టెంబరు 25: తల్లాడ మండలం రంగాపురం గ్రామంలో సొసైటీ డైరెక్టర్, కాంగ్రెస్ నాయకుడు, మాజీ సర్పంచ్ యరమల వెంకటేశ్వర్‌రెడ్డికి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బుధవారం నివాళులర్పించారు. వెంకటేశ్వర్‌రెడ్డి మృత దేహానికి మంత్రి తుమ్మల పూలమాలలు వేసి నివాళులర్పించారు. వెంకటేశ్వర్‌రెడ్డి ఆశ యాలు సాధించాలని అన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ దంపతు లు, ఐడీసీ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు, డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య, మంత్రి పొంగులేటి క్యాంపు ఇన్‌చార్జి తుంబూరి దయాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు, సొసైటీ చైర్మన్లు, నాయకులు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.


వెంకటేశ్వర్‌రెడి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి తుమ్మల

పరిసరాల పరిశుభ్రత ముఖ్యం

● జడ్పీ సీఈవో దీక్షా రైనా

కొణిజర్ల, సెప్టెంబరు25: పరిసరాల పరిశుభ్రత ముఖ్యమని జడ్పీ సీఈవో దీక్షారైనా అన్నారు. బుధవారం మండల కేంద్ర మైన కొణిజర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలను బుధవారం జడ్పీ సీఈవో దీక్షారైనా సందర్శించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా పాఠశాల ఆవరణంలో మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో ఎంపీ డీవో రోజారాణి, ఎంఈవో అబ్రహం, పాఠశాల ప్రధానోపాధ్యా యులు శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు సహకరించాలి: మేయర్

ఖమ్మం సంక్షేమ విభాగం, సెప్టెంబరు 25: పరిసరాల పరిశ్రుభతకు ఖమ్మం ప్రజలందరూ సహకరించాలని, మేయర్ పునకొల్లు నీరజ పేర్కొన్నారు. బుధవారం 11వ డివిజన్‌లో కార్పొరేటర్ సరిపూడి రమాసతీష్ ఆధ్వర్యంలో లకారం ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేసిన క్లీన్‌లైన్స్ డే కార్యక్రమంలో మేయర్ పాల్గొని రహదారులను పరిశుభ్రం చేశారు. కార్పొరేటర్ ఆళ్ల నిరీషారెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ సంపత్‌కుమార్ పాల్గొన్నారు.





ఆంగ్ల పరిజ్ఞానం అందించేలా చూడాలి

» స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి. శ్రీజ

ఖమ్మం కలెక్టరేట్, సెప్టెంబరు25: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ప్రతి విద్యార్థికి ఆంగ్ల పరిజ్ఞానం అందించేలా ప్రత్యేక కోర్సు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ అన్నారు. బుధవారం జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో 6వ, 7వ తరగతి విద్యార్థులకు ఆంగ్ల భాష కోర్సు అమలుపై కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో ఆమె సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఆంగ్ల భాష పరిజ్ఞానం పెంపొందించేందుకు అమలు చేస్తున్న ఆంగ్ల భాష కోర్సులో గమనించిన అంశాలను అధికారులు వివరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ఆంగ్ల భాష పరిజ్ఞానం, ఆంగ్ల భాషలో మాట్లాడటం రావాలనే సంకల్పంతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఉన్నత పాఠశాలల్లో ఆంగ్ల భాష కోర్సు అమలు చేస్తున్నామని, ముందస్తుగా 16 ఉన్నత పాఠశాలలను ఎంపిక చేసుకుని, అందులో ఉన్న ఇంట్రాక్టివ్ ప్యానల్స్ ద్వారా ఆడియో, వీడియో వినియోగిస్తూ పిల్లల్లో ఆంగ్ల భాష పరిజ్ఞానం పెరిగేలా ప్రతిరోజు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామని అన్నారు. ప్రతి రోజూ 6వ, 7వ తరగతి విద్యార్థులకు 30 నిమిషాల పాటు ఇంటరాక్టివ్ ప్యానల్స్ ద్వారా ఆంగ్ల భాష కోర్సు బోధన చేస్తున్నట్లు తెలిపారు. పిల్లల పరిజ్ఞానం ప్రకారం బిగినర్, ఇంటర్మీడియట్, ప్రోఫిషియంట్ మూడు క్యాటగిరీలుగా విభజించామన్నారు. ప్రతి విద్యార్థీ ఆంగ్లం చదవడం, రాయడం, మాట్లాడటం రావాలని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాధికారి సోమశేఖరశర్మ, ఏఎంఓ రవి, ప్రాజెక్ట్ అధికారి రామకృష్ణ, ఉపాధ్యాయులు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీజ

వీవీసీ, బీవీకే ట్రస్ట్ ఆధ్వర్యంలో జనరిక్ మందుల దుకాణం ప్రారంభం


జనరిక్ మందుల దుకాణాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

ఖమ్మం కలెక్టరేట్, సెప్టెంబరు 25: ఖమ్మం నగరంలో వైరారోడ్ పరిధిలో వీవీసీ, బీవీకే ట్రస్ట్‌ల సంయుక్తంగా జెనెరిక్ మందుల షాపును ప్రారంభించారు. ఈ సందర్భంగా బీవీకే ట్రస్ట్ కార్యదర్శి నున్నానాగేశ్వరరావు మాట్లాడుతూ బీవీకే ట్రస్ట్ ద్వారా ప్రతినెల విజ్ఞానకేంద్రంలో పేద ప్రజలకు ఉచితంగా మందులు, తక్కువ ధరకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పేదప్రజలకు ప్రతి రోజూ మందులు తక్కువ ధరకు అందుబాటులో ఉండాలని ఉద్దేశంతో వీవీసీ ట్రస్ట్ చైర్మన్ వంకాయలపాటి రాజేంద్రప్రసాద్ సహకారంతో వీవీసీ, బీవీకే జెనెరిక్ మెడికల్ షాప్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఖమ్మంలో అత్యాధునిక అంబులెన్సులు, వైకుంఠరథాలు, బ్లడ్ డొనేషన్ కార్యక్రమాలతో పాటు మున్నేరు వరద ముంపు గ్రామాలలో ప్రజలకు అన్నదానం, మందులు, నూతన వస్త్రాలు, మంచినీరు 100 ట్యాంకర్లు 5 రోజులు పాటు సరఫరా చేసినట్లు తెలిపారు. వీవీసీ ట్రస్ట్ చైర్మన్ వీవీసీ వీఆర్ సంస్థల అధినేత వంకాయలపాటి రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ పేదప్రజలకు సేవ చేయడం మా ఇంటి పెద్దల ఆశయాలకు ప్రతిరూపంగా ట్రస్ట్ స్థాపించామని అన్నారు. ఈ కార్యక్రమంలో వీవీసీ ట్రస్ట్ వంకాయలపాటి ద్రౌపతి, ఉద్యోగులు, బీవీకే ట్రస్ట్ ప్రతినిధులు విక్రమ్, వై. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మధిరలో జోనల్ క్రీడలు ప్రారంభం

మధిర, సెప్టెంబరు 25: మధిరలో జోనల్ క్రీడలు బుధవారం స్థానిక టీవీఎం హైస్కూల్‌లో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ క్రీడలను ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఎంఈవో వై ప్రభాకర్ ప్రారంభించారు. జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన విజేతలకు షీల్డులు బహూకరించారు. ఈ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులకు దాతల సహాయంతో భోజనాలు ఏర్పాటుచేశారు.

తల్లాడ: తల్లాడ మండలం పినపాకలోని డాన్‌బోస్కో స్కూల్లో రెండురోజులపాటు జరిగిన జోనల్ క్రీడలు బుధవారం ముగిశాయి. ముగింపు కార్యక్రమంలో జోనల్ క్రీడల కన్వీనర్ ప్రసన్న కుమారి, పీఈటీలు రంజాన్, పాపారావు, డాన్‌బోస్కో ప్రిన్సిపాల్ ప్రదీప్‌రెడ్డి పాల్గొన్నారు.

డంపింగ్‌యార్డును తొలగించకుంటే నగరాన్ని స్తంభింపజేస్తాం

● పలు పార్టీల నాయకులు

ఖమ్మంటౌన్, సెప్టెంబరు 25: నగరంలోని రాపర్తినగర్ బీసీకాలనీ సమీపంలోని డంపింగ్‌యార్డును తరలించకుంటే ఆందోళన ఉధృతం చేసి నగరాన్ని స్తంభింపచేస్తామని వివిధ పార్టీలనేతలు హెచ్చరించారు. డంపింగ్‌యార్డు తరలించాలంటూ చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి ఆరోరోజు చేరుకున్నాయి. ఆందోళనలో సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహమ్మద్ మౌలానా, పోటు కళావతి, బోడా వీరన్న, రామ్మూర్తి, కృష్ణమూర్తి, గోపి భాస్కర్, పగడాల నాగేశ్వరరావు, బాబు, బాణోత్ చందర్, అజ్మీర రామ్మూర్తి, దోమల రవి, బత్తుల శ్రీను పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలను పరిష్కారం కోసం ముందుకెళ్లాలి

ఖమ్మంటౌన్, సెప్టెంబరు 25: సీతారాం ఏచూరి స్ఫూర్తితో విద్యారంగ సమస్యలను పరిష్కారం కోసం ముందుకెళ్లాలని ప్రముఖ న్యాయవాది కొల్లి సత్యనారాయణ పిలుపునిచ్చారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం నగరంలోని పీజీ కళాశాలలో ఏచూరి సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సంస్మరణ సభలో కళాశాల ప్రిన్సిపాల్ రవికుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు రాజు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టీ. ప్రవీణ్,పూర్వ విద్యార్థి బొంతు రాంబాబు, అధ్యాపకులు, ఎస్ఎఫ్ఐ నాయకులు మనోజ్, మల్సూర్, సాయి, రమ్య, సుశీల తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని విజయవంతం చేయండి

నేలకొండపల్లి, సెప్టెంబరు25: విద్యార్థి సంఘం పీడీఎస్‌యూ ఏర్పడి 50 ఏళ్లు నిండిన సందర్భాన్ని పురస్కరించుకుని ఈనెల28న పీడీఎస్‌యూ పూర్వ ప్రస్తుత విద్యార్థుల స్వర్ణోత్సవ సభను నిర్వహించనున్నట్లు నిర్వాహక కమిటీ నాయకులు చిర్రా రవి, సీహెచ్‌పుల్లయ్యలు తెలిపారు. 28న కూసుమంచి రోడ్డులో సభను నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఉపాధ్యాయ రేషనలైజేషన్ మార్గదర్శకాల్లో మార్పు చేయాలి

తల్లాడ, సెప్టెంబరు 25: ఉపాధ్యాయ రేషనలైజేషన్ మార్గదర్శకాల్లో మార్పు చేయాలని పీఆర్టీయూ ఉపాధ్యక్షుడు యలమద్ది వెంకటేశ్వర్లు కోరారు. బుధవారం రఫిక్‌పాషా ఆధ్వర్యంలో నిర్వహించిన పీఆర్టీయూ మండల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. అనంతరం పీఆర్టీయూ మండల అధ్యక్షుడిగా ఉంగరాల వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా అద్దంకి గోపాలకృష్ణ, స హాధ్యక్షుడిగా పడాల సైదులు, ఉపాధ్యక్షుడిగా వై.రామిరెడ్డి, మహిళా ఉపాధ్యక్షురాలిగా శారదాదేవి, కార్యదర్శిగా బాలరామిరెడ్డి, మహిళా కార్యదర్శిగా సరోజిని, గౌరవాధ్యక్షుడిగా భాస్కర్‌లను ఎన్నుకున్నారు.

అక్టోబరు 3నుంచి జమలాపురంలో శ్రీదేవి శరన్నవరాత్రులు

ఎర్రుపాలెం, సెప్టెంబరు25: జమలాపురం శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలను వచ్చే నెల 3నుంచి నిర్వహిస్తున్నట్లు ఈవో కె.జగన్మోహన్‌రావు బుధవారం తెలిపారు. అదే విధంగా దేవాదాయశాఖ పర్యవేక్షణలో శ్రీవారి ఆలయం హుండీని సిబ్బంది బుధవారం లెక్కించారు. రూ.29,57,477లు వచ్చినట్లు ఆలయ ఈవో జగన్మోహన్‌రావు తెలిపారు.

క్రమశిక్షణతో చదువుకోవాలి

తిరుమలాయపాలెం, సెప్టెంబరు25: విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలు చేరుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి పుల్లయ్య తెలిపారు. బుధవారం తిరుమలాయపాలెంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలను, కళాశాలలను తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో సిలార్, ఏవో సీతారాంరెడ్డి, ఎస్‌వో రమాకుమారిపాల్గొన్నారు.

ఇళ్లస్థలాలు దక్కాలన్నదే లక్ష్యం

ఖమ్మంటౌన్, సెప్టెంబరు 25: జర్నలిస్టులకు ఇళ్లస్థలాలు దక్కాలన్నదే ఏకైక లక్ష్యమని జర్నలిస్టు యూనియన్ నేతలు పేర్కొన్నారు. బుధవారం నగరంలోని మంచికంటి భవన్‌లో టీయూడబ్ల్యూజే(టీజేఎఫ్) జిల్లా అధ్యక్షుడు ఆకుతోట ఆదినారాయణ, టీయూడబ్ల్యూజే(ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు వనం వేంకటేశ్వర్లు, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు పల్లా కొండలరావు నేతృత్వంలో అత్యవసర సమావేశం నిర్వహించారు. అనంతరం హౌసింగ్‌కమిటీ ఉపాధ్యక్షుడు బొల్లం శ్రీనివాస్ అధ్యక్షతన పాలకవర్గ సమావేశం నిర్వహించి, హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడిగా కనకం సైదులును ఎన్నుకున్నారు. త్వరలోనే ప్రధాన కార్యదర్శి, కోశాధికారితో పాటు సభ్యులను ఎన్నుకోవాలని నిర్ణయించారు.

'అధిక దిగుబడులు సాధించాలి'

వైరా, సెప్టెంబరు 25: అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగు విధానంలో అధిక దిగుబడులు సాధించవచ్చునని మధ్య తెలంగాణ మండలం సహాయ పరిశోధన వ్యవసాయ సంచాలకుడు డాక్టర్ ఆర్.ఉమారెడ్డి పేర్కొన్నారు. వైరాలోని కృషి విజ్ఞాన కేంద్రంలో బుధవారం నిర్వహించిన వర్క్‌షాపులో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సైంటిస్టు డాక్టర్ నాగభూషణం, ప్రిన్సిపల్ సైంటిస్టు జి.వీరన్న, అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ హేమంతకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ఏన్కూరు సెప్టెంబరు25: మండలంలోని టీఎల్‌పేట గుడ్ న్యూస్ హైస్కూల్ విద్యార్థులు కరాటే పోటీల్లో ప్రతిభచాటారు. ఈనెల 22న హైదరాబాదు యూసుఫ్‌గూడ కోట్ల విజయభాస్కరరెడ్డి స్టేడియంలో జరిగిన జాతీయస్థాయి జూనియర్ కరాటే చాపింయన్ పోటీల్లో బి.హారిక, వి.శశివర్ధన్, ఎల్.పరిణీత, జి.ప్రసన్నకుమార్, ఎస్‌కేసఫియా, జి.హర్షితలు ప్రతిభ చూపి సినీనటుడు సుమన్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందుకున్నారు. ప్రతిభచూపిన విద్యార్థులను, కరాటే మాస్టర్ శ్రీకాంత్‌ను ఉపాధ్యాయులు అభినందించారు.

29న సమ్మెట ఉమాదేవికి పురస్కారం అందజేత

ఖమ్మం సాంస్కృతికం, సెప్టెంబరు 25: ప్రముఖ కథా రచయిత్రి సమ్మెట ఉమాదేవికి ఉరిమళ్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 29న ఖమ్మంలో భోగోజు సముద్రమ్మ, పురుషోత్తం స్మారక పురస్కారాన్ని అందజేయనున్నారు. మంచికంటి హాల్‌లో ఉదయం11 గంటలకు జరిగే ఉరిమళ్ల ఫౌండేషన్ ఆరో వార్షికోత్సవ సభలో ఈపురస్కారాన్ని అందిస్తారు.. ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన జాతీయస్థాయి కథల, కవిత్వ పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఈ సభలోనే బహుమతులు అందజేస్తారు.

మార్కెట్ చైర్మన్ సీతారాములుకు సన్మానం

నేలకొండపల్లి, సెప్టెంబరు25: నేలకొండపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన వెన్నపూసల సీతారాములును బుధవారం వివిధ గ్రామాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు మార్కెట్ కార్యాలయంలో కలిసి సన్మానించారు. సన్మానించిన వారిలో వాణిజ్య ప్రముఖుడు గెల్లా జగన్మోహన్‌రావు, ఖమ్మం, ప్రగతి విద్యాసంస్థల అధినేత సురేష్, డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషయ్య తదితరులున్నారు.

బీజేపీ పార్టీని బలోపేతం చేద్దాం: రవికుమార్

నేలకొండపల్లి, సెప్టెంబరు25: భారతీయ జనతా పార్టీ వ్యవస్థాపకుడు పండిట్ దీన్‌దయాల్ ఉపాధ్యాయ ఆశయాలతో పార్టీని బలోపేతం చేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నున్నా రవికుమార్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. దీన్‌దయాల్ ఉపాధ్యాయ జయంతిని బుధవారం నేలకొండపల్లిలోని పార్టీ కార్యాయంలో నిర్వహించారు. పార్టీ సీనియర్ నాయకుడు భవనాశి దుర్గారావును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అనంత ఉపేందర్, షేక్.షర్ఫుద్దీన్, మన్నె కృష్ణారావు, పాగర్తిసుధాకర్, గెల్లా చక్రపాణి, కాశంగి వెంకటేశ్వర్లు, బాజా రామకృష్ణ, కనకబండి రమేష్, మొయినుద్దీన్ పాల్గొన్నారు.

ప్రజలను చైతన్యపర్చడానికే శౌర్యయాత్ర

ముదిగొండ, సెప్టెంబరు 25: రాష్ట్ర వ్యాప్తంగా తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట ఘట్టాన్ని ప్రజలకు వివరించి చైతన్యపర్చడానికే శౌర్యయాత్ర చేపట్టడం జరిగిందని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు పొన్నం వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం గోకినపల్లిలో ప్రజానాట్యమండలి కళాకారులు శౌర్యయాత్ర నాటకాన్ని ప్రదర్శించారు. మండల కార్యదర్శి బట్టు పురుషోత్తం, వాసిరెడ్డి ప్రసాద్, పయ్యావుల పుల్లయ్య, రాయల శ్రీనివాసరావు, మందరపు పద్మ, వెంకన్న, బట్టు రాజు, వేల్పుల భద్రయ్య, పుచ్చకాయల లక్ష్మయ్య, సత్యం పాల్గొన్నారు.

చాకలి ఐలమ్మ జయంతి ఉత్సవాలను నిర్వహించాలి

బోనకల్, సెప్టెంబరు 25: చాకలి ఐలమ్మ 129వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించాలని రజక సంఘ రాష్ట్ర నాయకుడు తమ్మారపు బ్రహ్మయ్య కోరారు. బోనకల్‌లో బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ హైదరాబాద్‌లో గురువారం ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్న జయంతి ఉత్సవాల కమిటీలో తనకు స్థానం కల్పించారని తెలిపారు. ఐలమ్మ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు.

ఖమ్మంచర్చికాంపౌండ్: చిట్యాల ఐలమ్మ జయంతిని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు వీరనారీమణుల ఆశయసాధన సమితి జిల్లా అధ్యక్షురాలు భూక్యా ఉపేంద్రబాయి బుధవారం పేర్కొన్నారు.

గురుకులాల్లో సమస్యలను పరిష్కరించాలి

మధిర, సెప్టెంబరు 25: గురుకుల పాఠశాలల్లో విద్యార్దులు, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కోరుతూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో గురుకుల జేఏసీ నాయకులు మధిర ఎమ్మెల్యే భట్టి క్యాంపు కార్యాలయం అధికారులకు బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి నాగూర్‌వలీ, మైనార్టీ గురుకుల జిల్లా కార్యదర్శి దామోదర్, బీసీ గురుకులాల రాష్ట్ర కార్యదర్శి సురేష్, సోషల్ వెల్ఫేర్ గురుకులాల రాష్ట్ర కార్యదర్శి సాంసన్, మధిర కార్యదర్శి రావిరాల లక్ష్మణరావు, అనుమోలు కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువుల పంపిణీ

ఖమ్మం ఖానాపురంహవేలి, సెప్టెంబరు25: డోర్నకల్ మండలం కస్నాతండలో వరదలకు నష్టపోయిన 300 కుటుంబాలకు బుధవారం నగరంలోని ఎస్‌బీఐటీ ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో విద్యాసంస్థల చైర్మన్ గుండాల కృష్ణ నిత్యావసర సరుకులను అందించారు. ఎన్నారై సేవా సంస్థ ఆస్థా సహకారంతో ఎస్‌బీఐటి కళాశాల ఆధ్వర్యంలో నిత్యవసర వస్తువులను అందించినట్లు కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ ధాత్రీ తెలిపారు. మాజీ సర్పంచ్ రాంమూర్తి, వెంకన్న, బాబురావులతోపాటు స్థానికులు సహకరించినట్లు ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాంమూర్తి, వెంకన్న, బాబురావు వైస్ ప్రిన్సిపాల్ అమిత్ బింధాజ్, గంధం శ్రీనివాసరావు, శివప్రసాద్, పాల్గొన్నారు.

పోషకాహారంతోనే ఆరోగ్యం మెరుగు : సీడీపీవో

సత్తుపల్లిరూరల్, సెప్టెంబర్25: పోషక విలువలు కలిగిన ఆహారంతోనే ఆరోగ్యం మెరుగవుతుందని ఐసీడీఎస్ సీడీపీవో కనకదుర్గ అన్నారు. బుధవారం సత్తుపల్లిలోని అయ్యగారిపేట సెక్టార్‌తో పాటు తాళ్లమడలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించిన కార్యక్రమాలలో ఆమె పాల్గొని చిన్నారులు, తల్లులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు యూ.మహాలక్ష్మి, గంగాజలం, టీచర్లు రహ్మతున్నీసా, రాధ, సావిత్రి, శకుంతల, కమల, మంగతాయారు, భారతి, సత్యావతి, సత్యవాణి, ఆయాలు వరలక్ష్మి, ఏసుకుమారి, వెంకటమ్మ పాల్గొన్నారు.


ఆహార పదార్థాల ప్రదర్శనను పరిశీలిస్తున్న సీడీపీవో కనకదుర్గ

'తాత్కాలిక మానసిక ఆనందం వద్దు'

సత్తుపల్లిరూరల్, సెప్టెంబరు25: మత్తు పదార్థాలతో పొందే తాత్కాలిక మానసిక ఆనందం వద్దని మదర్‌థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డా.చలసాని హరికృష్ణ అన్నారు. మిస్ట్ యాంటీ ర్యాగింగ్, యాంటీ డ్రగ్స్ కమిటీ ఆధ్వర్యంలో మండలంలోని మదర్‌థెరిస్సా అటానమస్ ఇంజనీరింగ్ కళాశాలలో సక్సెస్ వర్సెస్ వెల్‌నెస్‌పై బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ వైద్య నిపుణులు డాక్టర్. అశోక్‌కుమార్, సీనియర్ అడ్వకేట్ పిన్నం జానకీరామారావులు పాల్గొని అవగాహన కల్పించారు కార్యక్రమంలో ఇంజనీరింగ్ డీన్ డా.జాకీర్‌హుస్సేన్, డా.ఎంవీ.రామచంద్రరావు పాల్గొన్నారు.

ఎంఈవోల నియామకం

పెనుబల్లి, సెప్టెంబరు 25: మండల విద్యాశాఖ అధికారిగా వీఎంబంజర్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్.సత్యనారాయణ బుధవారం బాధ్యతలు చేపట్టారు.

కొణిజర్ల: మండల ఎంఈవోగా తనికెళ్ళ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం అబ్రహం బుధవారం బాధ్యతలు చేపట్టారు.

ఎర్రుపాలెం: మండల విద్యాశాఖ అధికారిగా (ఎఫ్ఏసీ) మీనవోలు జిల్లా పరిషత్ పాఠశాల హెచ్‌ఎం బి. మురళీమోహన్‌రావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు.

ముదిగొండ: ముదిగొండ మండల విద్యాశాఖ అధికారిగా డి.రమణయ్య బుధవారం బాధ్యతలు చేపట్టారు.

బోనకల్: మండలంలోని కలకోట గ్రామానికి చెందిన దామాల పుల్లయ్య బుధవారం మండల విద్యాశాఖాధికారిగా బాధ్యతలను స్వీకరించారు.

సత్తుపలి: సత్తుపల్లి ఎంఈవోగా మండలంలోని కాకర్లపల్లి జడ్పీహెచ్‌ఎస్‌లో గెజిటెడ్ హెడ్ మాస్టర్‌గా పని చేస్తున్న నక్కా రాజేశ్వరరావు బాధ్యతలు స్వీకరించారు.

కామేపల్లి: కామేపల్లి నూతన ఎంఈవోగా జీ. వెంకట్ పూర్తి స్థాయి అదనపు బాధ్యతలను బుధవారం స్వీకరించారు.

ముస్లింలకు స్థలాన్ని కేటాయించాలి

కల్లూరు, సెప్టెంబరు 25: కల్లూరులోని జామియా మసీదు ప్రాంగణ సమీపాన గల ప్రభుత్వ పరిధిలో గల స్థలాన్ని ముస్లింల అవసరాలకు కేటాయించాలని కోరుతూ బుధవారం ఆర్డీవోకు మండల ముస్లిం మతపెద్దలు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు సయ్యద్ అలీ, ఎండి హనీఫ్, ఎస్‌కే యాఖుబ్ అలీ, కాంగ్రెస్ నాయకులు పసుమర్తి చందర్‌రావు, భాగం ప్రభాకర చౌదరి, ఎసకే ఉస్మాన్, ఇబ్రహీం, ఎస్‌డి ఇషాక్, అయూబ్, మాబు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులను మంజూరు చేయాలి

ఏన్కూరు, సెప్టెంబరు25: పెండింగ్ బిల్లులు వెంటనే మంజూరు చేయాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు వై.వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో జరిగిన సంఘం సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈకార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.రంగారావు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు బ్రహ్మారెడ్డి, వైరా మండల అధ్యక్షుడు నరసింహారావు జన్నారం హెచ్‌ఎం మన్మోహన్‌రెడ్డి, పాల్గొన్నారు..

ఎన్నెస్పీ స్థలాల ఆక్రమణ

వైరా, సెప్టెంబరు 25: వైరాలోని ఎన్నెస్పీ వైరా మేజర్‌కు చెందిన స్థలాల ఆక్రమణ పలువురు ఆక్రమించేందుకు ప్రయత్నించారు. అధికార యంత్రాంగం చోద్యం చూస్తుండిపోవడంతో దానిని అవకాశంగా తీసుకొని ఆక్రమణదారులు తెగబడ్డారు. ఎన్నెస్పీకి చెందిన వైరా మేజర్ స్థానిక అయ్యప్ప స్వామి ఆలయం మొదలు కొని మధిర రోడ్డులోని సాంఘీక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల వరకు దాదాపు 60 అడుగుల వెడల్పుతో తొమ్మిది ఎకరాలకుపైగా స్థలాలు నిరుపయోగంగా పడి ఉన్నాయి. ఈ భూముల విలువ కోట్లాది రూపాయలుగా ఉంది. సోమవారం అర్ధరాత్రి కొంతమంది రైతువేదిక సమీపంలో ఎన్నెస్పీ స్థలాలను ఆక్రమిస్తూ చీరలు, తాళ్లతో హద్దులు ఏర్పాటు చేసుకున్నారు. ఇదే అదునుగా భావించి ఇంకా అనేకమంది బుధవారం పోటాపోటీగా తమ సొంత స్థలాలు వలె ఎన్నెస్పీ స్థలాలను ఆక్రమించి హద్దులు ఏర్పాటు చేసుకున్నారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ, నీటిపారుదల, మునిసిపల్‌శాఖ అధికారులు చోద్యం చూస్తున్నారే తప్ప ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం గమనార్హం.

సిరి సీడ్స్ రూ.5లక్షల ఆర్థిక సాయం అందజేత

ఖమ్మం సంక్షేమ విభాగం, సెప్టెంబరు 25: మున్నేరు వరద ముంపు బాధితులకు ఆర్థికంగా చేయూత అందించేందుకు సిరి సీడ్స్ యాజమాన్యం ముందుకొచ్చారు. బుధవారం హైదరాబాద్‌లో మంత్రి తుమ్మల నాగేశ్వరరావును సిరి సీడ్స్ ఎండీలు పెద్దిన మురళీకృష్ణ, వివేకానంద అరిమిల్లి, రాకేష్‌రెడ్డిలు కలిసి రూ.5లక్షల చెక్కును మంత్రి తుమ్మలకు అందించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ సిరి సీడ్స్ నిర్వాహకులను అభినందించారు.


మంత్రి తుమ్మలకు రూ. 5లక్షల చెక్కును అందిస్తున్న పెద్దిన మురళీకృష్ణ

19వ డివిజన్‌లో రహదారి కొలతల సేకరణ

ఖమ్మం సంక్షేమ విభాగం, సెప్టెంబరు 25: రహదారుల ఆక్రమణలపై నగర పాలకసంస్థ అధికారులు నజర్ పెట్టారు. ఖమ్మం నగరంలో రహదారుల ఆక్రమణలపై మంత్రి తుమ్మలకు వరస ఫిర్యాదులు రావడంతో ఆ మేరకు చర్యలు తీసుకోవాలని కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్యను ఆదేశించారు. దీంతో బుధవారం ఖమ్మం టౌన్ ప్లానింగ్ ఏసీపీ వసుంధర ఆధ్వర్యంలో 19వ డివిజన్‌లో ఆక్రమణకు గురైన రహదారి కొలతలను సేకరించారు. దశల వారీగా నగరంలోని అన్ని రహదారుల లెక్కలను తెలుస్తామని అధికారులు పేర్కొన్నారు.

జేవీఆర్ కళాశాలకు స్వయం ప్రతిపత్తికి ఆమోదం

సత్తుపల్లి, సెప్టెంబర్25: సత్తుపల్లిలోని జేవీఆర్ ప్రభుత్వ కళాశాలకు స్వయం ప్రతిపత్తికి అనుమతిస్తూ బుధవారం కాకతీయ విశ్వ విద్యాలయం నుంచి ఉత్తర్యులు జారీ అయినట్లు ప్రిన్సిపాల్ డా.ఎస్.గోపి తెలిపారు. ఈ సందర్భంగా అట్టి ఉత్తర్యుల నకళ్లను సత్తుపల్లి ఎమ్మెల్యే డా.మట్టా రాగమయి ప్రిన్సిపాల్ డా.ఎస్.గోపికి అందజేశారు. దీంతో కళాశాలలో మౌలిక వసతులు వచ్చే అవకాశం ఉందన్నారు.

హోప్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో 100మంది మహిళలకు కుట్టుమిషన్లను ఎమ్మెల్యే డా.మట్టా రాగమయి చేతుల మీదుగా పంపిణీ చేశారు. జేవీఆర్ కళాశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమం లో డాక్టర్ మట్టా దయానంద్, అలవాల కరుణాకర్, శామ్యూల్ జాషువా పాల్గొన్నారు.

స్వచ్ఛతాహీసేవా కార్యక్రమం

మధిర, సెప్టెంబరు 25: మధిర కోర్టులో బుధవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమాన్ని జడ్జి కార్తికరెడ్డి ప్రారంభించి మాట్లాడారు. ఈకార్యక్రమంలో ఏపీపీ జె భద్రయ్య, సూపరింటెండెంట్ సత్యనారాయణ, అధికారులు సూర్యనారాయణ, స్వచ్ఛంద సంస్థల వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ

ఖమ్మం లీగల్. సెప్టెంబరు 25: కస్నతండాలో తెలంగాణ గిరిజన సమాఖ్యా రాష్ట్ర అధ్యక్షుడు అజ్మీరా రామ్మూర్తి నాయక్ ఇండియన్ లాయర్స్ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లా కోర్టు ఆవరణలో బుధవారం సుమారు 200 దుప్పట్లు పంపిణీ చేసి ఔదార్యం చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ లాయర్ అసోసియేషన్ రాష్ట్ర నాయకుడు ఓరుగంటి శేషగిరిరావు, జిల్లా అధ్యక్షుడు షేక్ లతీఫ్, న్యాయవాదులు తౌఫిక్, ముక్తేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

